



ఎమ్మెల్సీ ఛాన్స్ ఎవరికో?

మార్చిలో ఖాళీ కానున్న నాలుగు శాసనమండలి స్థానాలు

- ఎమ్మెల్యేల కోటాలో పెద్దల సభకు అవకాశాలపై పార్టీల్లో చర్చ
- కాంగ్రెస్ నుంచి తెరపైకి మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు పేరు
- సీఎం రేవంత్‌రెడ్డి గతంలోనే హామీ ఇచ్చారంటున్న వర్గీయులు
- ప్రయత్నాలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి, ఝాన్సీరెడ్డి, ఇందిర
- ఇప్పటికే సీఎం, పలువురు మంత్రులు, టీపీసీసీ అధ్యక్షుడిపై ఒత్తిడి
- 'గులాబీ' అధిష్ఠానం దృష్టిలో మాజీ మంత్రి ఎర్రబెల్లి పేరు?
- మళ్లీ హాట్‌టాపిక్‌గా మారిన ఓరుగల్లు పాలిటిక్స్



కొండా మురళీధర్‌రావు, కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, మామిండ్ల ఝాన్సీరెడ్డి, శనిగరపు ఇందిర

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

వచ్చే మార్చిలో ఎమ్మెల్యేల కోటాలో నాలుగు ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ అవుతున్నాయి. వాటిలో ప్రస్తుతం శాసనసభలోని బలబలాల దృష్ట్యా కాంగ్రెస్‌కు మూడు, బీఆర్ఎస్‌కు ఒకటి దక్కే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల నుంచి ఆశావాహులు ఎమ్మెల్సీ సీట్లపై నజర్ వేశారు. ప్రధానంగా కాంగ్రెస్ నుంచి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి అవకాశం దక్కని వారితో పాటు పలువురు సీనియర్ నేతలు ఎమ్మెల్సీ సీటు దక్కించుకునేందుకు అధిష్ఠానం వద్ద పావులు కదుపుతున్నారు. ఈ క్రమంలో ఓరుగల్లు నుంచి కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు మరోసారి శాసనమండలిపై కన్నేశారనే చర్చ జరుగుతోంది. అలాగే గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, శనిగపురం ఇందిరతో పాటు మామిండ్ల ఝాన్సీరెడ్డి పేర్లు కూడా వినిపిస్తున్నాయి. ఇక బీఆర్ఎస్ నుంచి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పేరును అధిష్ఠానం పరిశీలిస్తోందని సమాచారం. ఖాళీ అయ్యే ఎమ్మెల్సీ స్థానాల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి ఎవరికి సీటు దక్కుతుందోనన్న ఉత్కంఠ ఓరుగల్లు రాజకీయాల్లో నెలకొంది.

ఎమ్మెల్సీ సీటుపై కొండా దృష్టి?

ప్రస్తుతం అధికార పార్టీలో ఎమ్మెల్సీ సీటుపై తీవ్ర పోటీ నెలకొంది. మరో నాలుగు నెలల్లో శాసనసభ్యుల కోటాలోని ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. దీంతో ఇప్పటి నుంచే అధిష్ఠానం వద్ద నేతలు పైరవీలు చేస్తుండగా, మరికొందరు గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని గుర్తు చేస్తున్నారు. ప్రధానంగా మంత్రి కొండా సురేఖ భర్త, మాజీ ఎమ్మెల్సీ మురళీధర్‌రావు శాసనసభ్యుల కోట నుంచి ఎమ్మెల్సీ రేసులో ఉన్నారనే చర్చ జరుగుతోంది. 2023 ఎన్నికల్లో పరకాల నుంచి పోటీకి మురళీ ప్రయత్నాలు చేశారు. ఎన్నికల తరువాత ఎమ్మెల్సీగా అవకాశం ఇస్తామని నాడు టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్‌రెడ్డి హామీ ఇవ్వటంతో ఆయన పరకాల బరి నుంచి తప్పుకున్నారని అప్పట్లో చర్చించుకున్నారు. ఆ తరువాత జరిగిన పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా పోచమ్మమైదాన్ వద్ద జరిగిన సభలో కొండా మురళికి ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని కార్యకర్తలు నినాదాలు చేశారు. దీంతో సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి స్వయంగా మురళికి పదవి ఇచ్చే బాధ్యత తనదని హామీ ఇచ్చారు. ప్రస్తుతం శాసన సభ్యుల కోటాలో ఎమ్మెల్సీ సీట్లు ఖాళీ అవుతుండటంతో కొండా మురళికి ఎమ్మెల్సీ పదవీపై సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్టుగా సమాచారం. 2009లో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించి తొలిసారి శాసన మండలిలో కొండా మురళి అడుగు పెట్టారు. ఆ తరువాత 2015 డిసెంబరు 11న జరిగిన ఎన్నికల్లో రెండోసారి బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అయితే 2021వరకు ఎమ్మెల్సీగా పదవీకాలం ఉన్నప్పటికి 2018లో కొండా దంపతులు బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. పార్టీ మారిన నేపథ్యంలో 2018 డిసెంబరు 22న ఎమ్మెల్సీ పదవికి కూడా కొండా మురళీధర్‌రావు రాజీనామా చేయాల్సి వచ్చింది. మూడోసారి శాసన మండలిలో అడుగు పెట్టేందుకు మురళీధర్ రావు ప్రయత్నాలు చేస్తున్నారనే చర్చ జరుగుతోంది.

తెరపైకి కొమ్మూరి, ఝాన్సీ, ఇందిర పేర్లు..

కాంగ్రెస్ నుంచి మరికొందరు కీలక నేతలు ఎమ్మెల్సీ సీటుపై దృష్టి పెట్టారు. వీరిలో జనగామ మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డికి ఆఫర్ వచ్చిందనే చర్చ జరుగుతోంది. 2004లో అప్పటి చేర్యాల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ప్రతాప్‌రెడ్డి విజయం సాధించారు. ఆ తరువాత

మిగతా 7వ పేజీలో..

గులాబీ సీటు ఎర్రబెల్లికేనా?

ఎమ్మెల్యే కోటలో నాలుగు ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ అవుతుండగా అందులో బీఆర్ఎస్‌కు పక్కాగా ఒక సీటు దక్కుతుందని, ఆ సీటును మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు కేటాయిస్తారనే చర్చ జరుగుతోంది. ఉమ్మడి వరంగల్‌కు చెందిన మాజీ మంత్రి సత్యవతిరాథోడ్ పదవికాలం కూడా ఈ మార్చిలోనే పూర్తవుతుండగా.. తనకు మరోసారి అవకాశం కల్పిస్తారనే ఆశతో సత్యవతి ఉన్నట్టు సమాచారం. అయితే ప్రస్తుతం కాంగ్రెస్‌తో డీ అంటే డీ అనే విధంగా రాష్ట్రంలో రాజకీయాలు ఉండటంతో బలమైన నేతను మండలికి పంపించాలని గులాబీ బాస్ కేసీఆర్ భావిస్తున్నారని సమాచారం. ఎర్రబెల్లితో పాటు మరో నలుగురైదుగురి పేర్లను కూడా పరిశీలిస్తున్నప్పటికి ప్రధానంగా ఎర్రబెల్లి వైపే అధిష్ఠానం మొగ్గు చూపుతారన్న అంచనాలున్నాయి. కాగా, సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న ఎర్రబెల్లి ఏడు సార్లు చట్టసభలకు ఎన్నికయ్యారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పాలకుర్తి నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎర్రబెల్లి క్రియ శీలకంగా రాజకీ యాల్లో ఉండటంతో గులాబీ అధిష్ఠానం దయాకర్ రావుకే అవకాశం ఇస్తుందనే చర్చ గులాబీ వర్గాల్లో జరుగుతోంది.



వసతి గృహాల్లో విద్య, వైద్యంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- మండల ప్రత్యేకాధికారులు తనిఖీలు చేపట్టాలి
- కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్



సమావేశంలో మాట్లాడుతున్న అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సంక్షేమ వసతి గృహాల్లో విద్య, వైద్యం, పారిశుధ్యం, భోజన వసతిపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ హెచ్చరించారు. కలెక్టర్ కార్యాలయంలో మండల ప్రత్యేకాధికారులు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, అన్ని వసతి గృహాల ఇన్‌చార్జీలతో వాటి నిర్వాహణపై శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండల ప్రత్యేకాధికారులు గ్రామాలను అనునిత్యం సందర్శిస్తూ జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని 126 సంక్షేమ గృహాల్లో క్రమం తప్పకుండా తనిఖీలు చేపట్టాలన్నారు. చలికాలం దృష్ట్యా విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్య, వైద్యం, మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందిస్తూ ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యాబోధన చేయాలన్నారు. హాస్టళ్లలో రాత్రి వేళల్లో విద్యుత్‌ను నిరంతరం సరఫరా చేయాలని, పాములు, విషపురుగులు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని, షెడ్యూల్ ప్రకారం వారికి వైద్యపరీక్షలు నిర్వహించాలన్నారు. మరుగుదొడ్లు, డైనింగ్ హాల్, స్టడీ రూమ్స్‌లలో పరిశుభ్రత పాటించే విధంగా అవగాహన కల్పించాలని తెలిపారు. మండల ప్రత్యేకాధికారులు వసతి గృహాల తనిఖీలు, అభివృద్ధి పనుల పురోగతిపై నివేదికను సమర్పించాలన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు గణేష్, కృష్ణవేణి, మధుసూదన్‌రాజు, పురుషోత్తం, వెంకటేశ్వర్లు, నర్సింహస్వామి, వేముల సురేష్, మరియన్న, విజయనిర్మల, సైదా పాల్గొన్నారు.

మరుగుదొడ్లు వినియోగించుకోవాలి..

జిల్లాలోని గ్రామపంచాయతీలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్లు వినియోగించుకోవాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్‌లో డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ మధూసూదన్‌రాజు అధ్యక్షతన వాటర్‌శానిటేషన్ మిషన్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ గ్రామపంచాయతీ నుంచి మరుగుదొడ్ల నిర్వహణలో ఉన్న ఉత్తమ టాయిలెట్స్‌ను గుర్తించి బహుమతులు ఇవ్వడం జరుగుతుందన్నారు. జిల్లాలో అసంపూర్తిగా ఉన్న మరుగుదొడ్లను డిసెంబర్ 10 వరకు పూర్తి చేయాలని సూచించారు. ప్రతీ ఒక్కరు బాధ్యత యుతంగా మరుగుదొడ్లను వినియోగించుకోవాలని 'మన మరుగుదొడ్లు- మన ఆత్మగౌరవం' అనే నినాదంతో ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థాయిలో ఉత్తమ శానిటేషన్ వర్కర్లను గుర్తించి సన్మానించారు. నూతనంగా మరుగుదొడ్లు నిర్మించుకునే వారికి అనుమతి పత్రాలను మంజూరీ చేశారు. సమావేశంలో జిల్లా అధికారులు పురుషోత్తం, హరిప్రసాద్, శ్రావణ్, రవికుమార్ పాల్గొన్నారు.

స్వయం సంఘాలకు సోలార్ ప్లాంట్లు



ఆర్ట్స్ కళాశాల మైదానంలో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో ఎంవోయూల మార్పిడి

- ఎస్‌హెచ్‌జీలకు అప్పగించుందుకు సర్కారు ఏర్పాట్లు
- రేవంత్ సమక్షంలో కుదిరిన త్రైపాక్షిక ఒప్పందం
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 54 మెగావాట్ల ఉత్పత్తికి కసరత్తు
- స్థల సేకరణలో డీఆర్‌డీఏ అధికారులు నిమగ్నం
- ఒక్కోప్లాంట్ ఏర్పాటుకు రూ.4కోట్లు వ్యయం
- ఎస్‌హెచ్‌జీల వాటా పది శాతం.. మిగతా మొత్తం బ్యాంకు రుణం

7



పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సురేష్

లోక్ అదాలత్ ద్వారా రాజీపడే కేసులను పరిష్కరించాలి

- జిల్లా కోర్టు సీనియర్ సివిల్ జడ్జి సురేష్

మహబూబాబాద్ రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కక్షిదారులు రాజీ మార్గం ద్వారా తమ కేసులను పరిష్కరించుకోవాలని మహబూబాబాద్ జిల్లా కోర్టు సీనియర్ సివిల్ జడ్జి సురేష్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కోర్టు ఆవరణలో సబ్ డివిజన్ పోలీస్ ఉన్నతాధికారులతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కోర్టులో వేల సంఖ్యలో కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, అన్నికేసులను ఏక కాలంలో పరిష్కరించడం సాధ్యం కాదని.. అందుకోసమే మన చేతులో ఉన్న అత్యున్నతమైనటువంటి ఆయుధమైన లోక్ అదాలత్‌ను వినియోగించుకుని రాజీపడే కేసులను పరిష్కరించాలన్నారు. డిసెంబర్ 14న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో క్రిమినల్ కేసు, సివిల్, భూ వివాదాలు, మోటార్ ప్రమాదం, వివాహ, కుటుంబ తగాదాలు, బ్యాంక్ చెక్‌బౌన్స్, ఎలక్ట్రిసిటీ, చిట్‌ఫండ్స్, ఇన్సూరెన్స్, ఎక్సైజ్, విద్యుత్ చోరీ, ట్రాఫిక్ ఈ- చలాన్ కేసులాంటివి పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి తిరుపతి, డీఎస్పీ తిరుపతిరావు, పీపీ చిలుకమారి వెంకటేశ్వర్లు, సీఐలు సర్వయ్య, సత్యనారాయణ, ఎస్సై విజయ్‌కుమార్, కోర్టు కానిస్టేబుల్ పాల్గొన్నారు.

ఇక్కడే.. ఉంటా..!

- బదిలీ ఐనా.. డీడీ కార్యాలయం వదలని ఉద్యోగి
- పదేళ్లుగా మానుకోట ఆఫీస్‌లోనే తిష్ట
- ఉన్నతాధికారుల ఆదేశాలు బేఖాతరు



మహబూబాబాద్ డీడీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి





కొత్తగూడ స్పోర్ట్స్ స్కూల్‌కు బదిలీ చేస్తూ జారీ ఉత్తర్వులు, జాయినింగ్ రిపోర్టు

నెహ్రూసెంటర్, నవంబరు22 (ఆంధ్రజ్యోతి) : గిరిజనులు నిలదీస్తున్నా.. సామాజిక సంఘాల వ్యతిరేకిస్తున్నా..ఉన్నతాధికారులు బదిలీ చేసినా.. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ (డీడీ) కార్యాలయంలోనే విధులు నిర్వహిస్తూ.. ఎక్కడికీ వెళ్లనంటూ ఓ ఉద్యోగి తిష్టవేసి కూర్చున్నాడు. బదిలీ ఏ ప్రాంతానికి చేసినా వేతనం ఎక్కడి నుంచి తీసుకున్నా విధులు మాత్రం జిల్లా కార్యాలయంలోనే నిర్వహిస్తానంటున్నాడు. సదరు జూనియర్ అసిస్టెంట్ తేజావత్ సోమానిని 2024 ఆగస్టు 20న జిల్లా కార్యాలయం నుంచి కొత్తగూడ స్పోర్ట్స్ స్కూల్‌కు బదిలీ చేస్తూ డీడీ సైదానాయక్ ఆదేశాలు జారీ చేశారు. ఆ వెంటనే సోమాని కొత్తగూడ వెళ్లి జాయినింగ్ రిపోర్టు చేసి వచ్చి, నాలుగునెలలు కావస్తున్నా ఏ ఒక్కరోజు కూడా కొత్తగూడలో విధులకు హాజరు కాకుండా మహబూబాబాద్ డీడీ కార్యాలయంలోనే విధులు నిర్వహిస్తూ ఉన్నతాధికారుల ఆదేశాలను బేఖాతరు చేస్తున్నాడు. గతంలో ఉన్న డీడీ ఎర్రయ్య సైతం సోమానిని బదిలీ చేయగా.. అప్పుడు బదిలీపై వెళ్లకుండా తనకున్న పలుకుబడితో ఒత్తిడి చేయించి తప్పించుకున్నాడని తెలుస్తోంది. గిరిజన శాఖకు సంబంధించి వివిధ అభివృద్ధి పనుల కోసం వచ్చే లబ్ధిదారులు, గిరిజనులకు ఇబ్బందులు పెడుతూ వివాదాస్పదంగా మారినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఏ అధికారి వచ్చినా తన మాటే చెల్లుబాటు చేసుకుంటున్నాడని చెబుతున్నారు. ఆయనపై ప్రజాసంఘాలు అనేక మార్లు ఆందోళన చేసినా, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా తాను మాత్రం బదిలీపై వెళ్లకుండా అధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు లేకుండానే డీడీ కార్యాలయంలో పనిచేయడం గర్హనీయం.

ఏదేమైనా సదరు ఉద్యోగి బదిలీ అయిన స్థానంకు వెళ్లి డీడీ కార్యాలయాన్ని వదిలి పెట్టాలని గిరిజన ఆదివాసీ ప్రజలు కోరుతున్నారు. ఇటీవలనే ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు బోడ రమేష్‌నాయక్ డీడీ కార్యాలయంలో పనిచేస్తున్న సోమానిని బదిలీ అయినా స్థానానికి పంపించాలని జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పోకు వినతిపత్రం అందజేశారు. కాగా, ఈ విషయమై కొత్తగూడ స్పోర్ట్స్ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు సారయ్యను వివరణ కోరగా సదరు ఉద్యోగి జాయినింగ్ అయిన తర్వాత జిల్లా అధికారి సూచన మేరకు డీడీ కార్యాలయంలో పని చేస్తున్నారని చెప్పారు. ఆ ఉద్యోగిని తిరిగి విధులకు రప్పిస్తామని అన్నారు. జిల్లా గిరిజన శాఖ డీడీ సైదా మాలోతును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా జూనియర్ అసిస్టెంట్ తేజావత్ సోమాని కొత్తగూడ స్పోర్ట్స్ స్కూల్‌లో కొన్ని రోజులు, డీడీ కార్యాలయంలో కొన్ని రోజులు విధులకు హాజరవుతున్నాడని చెప్పారు. సోషల్ ఆడిట్ ఉన్నందున జిల్లా కార్యాలయంలో పని చేయిస్తున్నట్లు డీడీ వివరించారు.

గ్రూపు-2 అభ్యర్థుల ఆప్‌లైన్ పరీక్షల కోసం దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ముస్లిం, క్రిస్టియన్, సిక్కులు, జైనులు, బౌద్దులు, పార్శియన్ గ్రూపు-2 అభ్యర్థులకు రెండు ఫ్రీపుల్ లెంగ్త్ మాక్ టెస్టులు నిర్వహించుటకు ఈనెల 29 వరకు ఆప్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి బి.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్రప్రభుత్వం, మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు టెస్ట్-1 డిసెంబరు 2,3 తేదీల్లో, టెస్ట్-2 డిసెంబరు 9,10 తేదీల్లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఈ పరీక్షను జిల్లాలోని మైనార్టీ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు పూర్తి చేసిన దరఖాస్తులను జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ కార్యాలయంలో ఈనెల 29 సాయంత్రం 4 గంటల వరకు అందజేయాలన్నారు. ఇతర వివరాలకు సెల్ నెంబర్లు: 918125 40680, 95737 69507లను సంప్రదించాలన్నారు.

అర్ధరాత్రి అలజడి



ఉయిక రమేష్ మృతదేహం

రమేష్(ఫైల్)

అర్జున్(ఫైల్)

అర్జున్ మృతదేహం

వాజేడులో మావోయిస్టుల ఘాతుకం

- పోలీసు ఇన్‌ఫార్మర్ల నెపంతో ఇద్దరి హత్య
- మారణాయుధాలతో దాడి చేసి హతమార్చిన వైనం
- 2007 తరువాత అతి పెద్ద సంఘటన
- మృతుల్లో ఒకరు పంచాయతీ కార్యదర్శి, మరొకరు కూలీ
- ఇద్దరూ వరసకు సోదరులు
- న్యాయం చేయాలని మృతదేహాలతో కుటుంబీకుల ధర్నా

మన్యంలో అర్ధరాత్రి అలజడి రేగింది. ఆదివాసీ ప్రాంతమైన వాజేడు మండలంలో మావోయిస్టులు ఘాతుకానికి పాల్పడ్డారు. పోలీసులకు ఇన్‌ఫార్మర్లుగా వ్యవహరిస్తున్నారన్న నెపంతో ఇద్దరిని కిరాతకంగా హత్యచేశారు. గురువారం అర్ధరాత్రి సమయంలో తమ తమ ఇళ్లలో నిద్రలో ఉన్న ఆ ఇద్దరిపై ఏకకాలంలో గొడ్డళ్లు, కత్తులతో దాడి చేసి హతమార్చారు. పెనుగోలు కాలనీలో జరిగిన ఈ ఘటనలో పంచాయతీ కార్యదర్శి ఉయిక రమేష్, అతడి పెదనాన్న కుమారుడైన ఉయిక అర్జున్ మృతిచెందారు. ఈ విషయం తెల్లవారేసరికి మన్యమంతా వ్యాపించడంతో గిరిపల్లెలు భయం గుప్పిట బిక్కుబిక్కుమంటున్నాయి. ఏజెన్సీ మండలాల్లో ఇప్పటికే మావోయిస్టుల టార్గెట్‌గా ఉన్న నేతలు, వ్యాపారులు సురక్షిత ప్రాంతాలకు తరలినట్టు తెలుస్తోంది. సురక్షిత ప్రాంతంగా ఉన్న వాజేడులో పోలీస్‌స్టేషన్‌కు కూత వేటు దూరంలో మావోయిస్టులు ఈ ఘటనకు పాల్పడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. 2007 తర్వాత వాజేడు ప్రాంతంలో జరిగిన అతిపెద్ద సంఘటన కావడం అందరిలోనూ ఆందోళన రేకెత్తిస్తోంది.

- వాజేడు, ఆంధ్రజ్యోతి

7



ఎల్బీనగర్, మాన్యతండాను సందర్శించిన కలెక్టర్



ఎల్బీనగర్‌లో అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ దివాకర

గోవిందరావుపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాంనగర్ పంచాయతీ పరిధిలోని ఎల్బీనగర్, మాన్యతండాలను ములుగు కలెక్టర్ టీఎస్. దివాకర శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ఎల్బీనగర్, మాన్యతండాలను శనివారం 50 కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు సందర్శించనున్న నేపథ్యంలో గ్రామసభలు ఏర్పాటు చేసేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని మండల అధికారులను ఆదేశించారు. వాటర్ ట్యాంకు, వీధిలైట్లు, తదితర సౌకర్యాలు, కావాల్సిన ఇతర సౌకర్యాల గురించి గ్రామసభలో కార్పొరేట్ సంస్థల ప్రతినిధులకు తెలియజేసేందుకు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆయన వెంట నిర్మాన్ సంస్థ ప్రతినిధి డేవిడ్, తహసీల్దార్ సృజన్ కుమార్, ఎంపీడీవో జవహర్‌రెడ్డి, ఎంపీవో శరత్, పంచాయతీ సెక్రటరీ స్వర్ణ, తదితరులు ఉన్నారు.

కల్వలలో క్రీడా కోలాహలం

- నేటి నుంచి రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ నెట్‌బాల్, ఘట్కా, తాంగ్తా పోటీలు
- పది జిల్లాల నుంచి 400 మంది క్రీడాకారులు రాక
- మూడు రోజుల పాటు నిర్వహణ



కల్వల జడ్పీ హైస్కూల్‌లో నెట్‌బాల్ పోటీలకు సిద్ధం చేస్తున్న మైదానాన్ని పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు, పీఈటీలు

కేసముద్రం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) రాష్ట్రస్థాయి అండర్ 17 బాల, బాలికల నెట్‌బాల్, మార్షల్ ఆర్ట్స్ క్రీడలైన ఘట్కా, తాంగ్తా పోటీలకు కేసముద్రం మండలం కల్వల సిద్ధమైంది. ఈనెల 23 నుంచి 25 వరకు కల్వల జడ్పీ ఉన్నత పాఠశాలలో నెట్‌బాల్, ప్రాథమిక పాఠశాలలో ఘట్కా, ఆదర్శ పాఠశాలలో తాంగ్తా పోటీలను నిర్వహించనున్నారు. రాష్ట్రంలోని పది ఉమ్మడి జిల్లాల నుంచి ఆయా క్రీడలకు చెందిన 400 మంది క్రీడాకారులు, 60 మంది కోచ్‌లు హాజరుకానున్నారు. వీరితో పాటు క్రీడల నిర్వహణకు పీఈటీలు, పీడీలు పాల్గొననున్నారు. క్రీడల నిర్వహణకు మైదానాలు, కోర్టులను ఆయా పాఠశాలల్లో సిద్ధం చేశారు. అలాగే క్రీడాకారులకు మూడు రోజులపాటు భోజన, వసతి కల్పించేందుకు ఏర్పాట్లను నిర్వాహకులు కల్పించారు. రాష్ట్రస్థాయిలో క్రీడలను నిర్వహిస్తుండడంతో మూడు రోజులపాటు కల్వలలో క్రీడల కోలాహలం నెలకొననుంది.

పదేళ్లలో విద్యా వ్యవస్థ నాశనం

- విద్యా వ్యవస్థ బలోపేతం కోసమే జిల్లాల పర్యటన
- రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి

భూపాలపల్లి కలెక్టరేట్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గత పాలకులు చేసిన అరాచకాల వల్ల రాష్ట్రంలో విద్యా వ్యవస్థ దెబ్బతిందని, గత పదేళ్లలో విద్యా వ్యవస్థ నాశనం అయిందని రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి అన్నారు. జిల్లాలో పర్యటించిన విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి కలెక్టరేట్‌లో శుక్రవారం రాష్ట్ర సమగ్ర విద్యా విధానంపై నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ఇతర వర్గాల ప్రజలతో చర్చా వేదిక నిర్వహించారు. అనంతరం వారి నుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆకునూరి మురళి మాట్లాడుతూ దేశంలో ప్రతి 2,3 ఏళ్లకు చేసే సర్వేల్లో 29, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను పరిశీలించగా విద్యావిధానంలో మన రాష్ట్రం 32 స్థానంలో ఉందన్నారు. గత పాలకుల పాలనలో విద్యావ్యవస్థ ఏస్థాయిలో దిగజారిపోయిందో అర్థం చేసుకోవచ్చన్నారు. నూతన ప్రభుత్వం విద్యా వ్యవస్థ బలోపేతం కోసం చర్యలు చేపట్టిందన్నారు. ప్రభుత్వం ఏ విధానాలు అమలుచేస్తే బాగుంటుందనే ఉద్దేశంతో తను విద్యా కమీషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన 2 నెలల్లో 70 సమావేశాలు నిర్వహించి వివిధ వర్గాల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించినట్లు తెలిపారు. రాష్ట్రంలో విద్యారంగంను బాగుచేసేందుకు విద్యా కమీషన్ సీరియస్‌గా స్టడీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యావ్యవస్థ పనితీరును పక్క రాష్ట్రాలు, విదేశాల్లో కూడా అధ్యయనం చేస్తున్నట్లు చెప్పారు. కేరళ, తమిళనాడు, ఢిల్లీ రాష్ట్రాల్లో పర్యటిస్తూ విద్యను ఏ విధంగా బలోపేతం చేస్తే బాగుంటుందని సీరియస్‌గా స్టడీచేసి ప్రభుత్వంకు ఒక పాలసీ అందజేస్తామన్నారు. చర్చా వేదిక నిర్వహించడం ద్వారా ప్రజల నుంచి వచ్చే సలహాలు, సూచనలు, అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని ఇక మంచి విద్యా పాలసీ రూపకల్పనలో మీరందరూ భాగస్వామ్యులు అవుతున్నారన్నారు.

రాష్ట్రంలో గద్వాల జిల్లా చాలా వెనుకబడి ఉన్నందున అక్కడి నుంచే చర్చా వేదికలు ప్రారంభించామని తెలిపారు. తరువాతి స్థానాల్లో భూపాలపల్లి, ములుగు జిల్లాలు అత్యంత వెనుకబడి ఉన్నాందున ఇక్కడ చర్చా వేదికలు నిర్వహించినట్లు తెలిపారు. ఇలాంటి చర్చవేదికలు నిర్వహించడం వలన ప్రజలు వివిధ వర్గాల నుంచి మంచి ఆలోచనలు వస్తాయని తద్వారా ఒక మంచి పాలసీని మనం రూపకల్పన చేసే అవకాశం ఉంటుందన్నారు. ప్రతీ ఒక్కరు విద్యారంగం బలోపేతం కోసం సలహాలు సూచనలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్‌శర్మ, అదనపు కలెక్టర్ విజయలక్ష్మీ, డీఈవో రాజేందర్, డీపీఆర్వో శ్రీనివాస్, సంబంధితశాఖల అధికారులు, వివిధ వర్గాల ప్రజలు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మికులకు జీవనభృతి ఇవ్వాలి

- ఏఐపీకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముంజంపల్లి వీరన్న

కొత్తగూడ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ కార్మికులకు రూ.12 వేలు జీవనభృతి ఇవ్వాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐపీకేఎంఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముంజంపల్లి వీరన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కొత్తగూడలో తహసీల్దారు రమాదేవికి ఆసంఘం నాయకులు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వీరన్న మాట్లాడుతూ వ్యవసాయం పూర్తిగా యాంత్రీకరణం కావడంతో వ్యవసాయ కూలీలకు పనిదొరకడం లేదన్నారు. దీంతో కూలీలు ఉపాధి కోసం పట్టణాలకు వలస పోతున్నారని పేర్కొన్నారు. వ్యవసాయ కార్మికులను గుర్తించి వారికి సంవత్సరానికి రూ. 12వేలు జీవనభృతి ఇస్తానని సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. డిసెంబరు 2న రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టర్ కార్యాలయాల ముందు చేపట్టబోతున్న నిరసన కార్యక్రమాన్ని వ్యవసాయ కార్మికులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు బండపల్లి వెంకటేశ్వర్లు, కోశాధికారి గొంది సమ్మయయ్య, మండల నాయకుడు కంగాల పాపయ్య, నాయకులు ముద్దరబోయిన కొమ్మాలు, ఐత శ్రీరాములు, గట్టి సారయ్య, వెంకన్న, సారయ్య, మాస్‌లైన్ కొత్తగూడ, గంగారం మండలాల కార్యదర్శి పూనెం ప్రభాకర్ పాల్గొన్నారు.



తహసీల్దార్ రమాదేవికి వినతి పత్రాన్ని ఇస్తున్న ఏఐపీకేఎంఎస్ నాయకులు

హామీల కోసం గొల్లకురుమలు ఐక్యంగా ఉద్యమించాలి



జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారికి వినతిపత్రం సమర్పిస్తున్న జీఎంపీఎస్ నాయకులు

మహబూబాబాద్ అగ్రికల్చర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ గొల్లకురుమలకు ఇచ్చిన హామీల అమలు కోసం ఐక్యంగా ఉద్యమించాలని గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్లం అశోక్ పిలుపునిచ్చారు. మహబూబాబాద్‌లోని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి కిరణ్‌కు శుక్రవారం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది కావోస్తున్న గొల్లకురుమల కుటుంబాలకు గొర్రెలకు బదులు రూ.2 లక్షల నగదు బదిలీ చేస్తామని ఇచ్చిన హామీ నేరవేర్చలేదని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా కోట్ల రూపాయల డీడీలు రెండు సంవత్సరాలుగా ప్రభుత్వం వద్ద పెట్టుకుని వెనక్కి తిరిగి ఇచ్చారన్నారు. గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని వెంటనే చేపట్టాలని, గొర్రెలకు, మేకలకు ప్రభుత్వమే ఉచితంగా ఇన్సూరెన్స్ చేయించాలని, సబ్సిడీపై జీవాలకు దాన సరఫరా చేయాలని కోరారు. గొర్రెల పెంపకందారులకు రూ.5 వేలు ఇవ్వాలని కోరారు. లేని పక్షంలో డిసెంబర్ 9 జీఎంపీఎస్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ప్రగతిభవన్ ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జీఎంపీఎస్ జిల్లా అధ్యక్షులు పయ్యావుల మల్లయ్య, కుమార్, రమేష్, అశోక్, మల్లేష్, కోడి మురళి, దేవేందర్, అశోక్, శేఖర్, వీరన్న పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

డిగ్రీ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు

జిల్లా టాస్క్ కోఆర్డినేటర్ రామకృష్ణ

ఏటూరునాగారం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో టాస్క్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ములుగు జిల్లా టాస్క్ కోఆర్డినేటర్ రామకృష్ణ హాజరై విద్యార్థులతో సంభాషిస్తూ టాస్క్ ఆధ్వర్యంలో అందుబాటులో ఉన్న వివిధ కోర్సులు, ఇతర ఉద్యోగ అవకాశాల గురించి ఆయన వివరించారు. దీంతో విద్యార్థులకు టాస్క్ ఆధ్వర్యంలో అందుబాటులో ఉన్న వివిధ కోర్సుల గురించి తెలుసుకునే అవకాశం లభించింది. అంతేకాకుండా వారి కెరీర్‌ను అభివృద్ధి చేసుకోవడానికి అవసరమైన నైపుణ్యాలను గుర్తించడానికి సహాయం లభించిందని, ఉద్యోగ వెతుకులాటలో ఎలా విజయం సాధించాలో అనే సలహాలను ఆయన అందించారు.

కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రేణుక మాట్లాడుతూ.. విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలను అందించడంలో తమ బాధ్యతను నిర్వహించి, విద్యార్థుల కెరీర్ అభివృద్ధికి తోడ్పడతామన్నారు. కార్యక్ర మంలో జిల్లా టాస్క్ కోఆర్డినేటర్ కనీస్ ఫాతిమా, మెంటార్ రమేష్, కళాశాల అధ్యాపకులు డాక్టర్ నవీన్, వెంకటయ్య, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులను చెల్లించాలి

టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమేష్

కొత్తగూడ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బాలాష్టి రమేష్ డిమాండ్ చేశారు. కొత్తగూడలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుల, పదవీ విరమణ పొందిన, మృతి చెందిన ఉపాధ్యాయులకు రావాల్సిన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. బిల్లులను వెంటనే చెల్లించి వారి కుటుంబాలను ఆదుకోవాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కరువు భత్య బకాయిలను వెంటనే ప్రకటించి, పీఆర్సీని అమలు చేయాలన్నారు. సమావేశంలో టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లెల సాంబయ్య, మండల అధ్యక్షుడు తీగల రమేష్, మేడ నర్సింహ రావు, కొప్పుల రేణేశ్వర్, రవి, సూర్యనారయణ, కీర్తిప్రియ, యాదగిరి పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది కలుగకుండా ధాన్యం కొనాలి

- సందేహాలుంటే 7995050789కు ఫోన్ చేయాలి
- మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు చేయాలని జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ సూచించారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం ధాన్యం కొనుగోళ్లపై అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఎంత ధాన్యం కొనుగోలు చేశారు..ఎంతమంది రైతులకు డబ్బులు వచ్చాయని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం మాయిశ్చర్ వచ్చిన తర్వాత ధాన్యం తీసుకోవాలని, కేంద్రాల్లోమౌళిక వసతులను కల్పించాలని సూచించారు. గన్ని సంచులు, ఎలక్ట్రానిక్ మిషన్లు, టార్పాలిన్ల కొరత లేకుండా చూసుకోవాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే లారీల ద్వారా తరలించాలని, అందుకు హమాలీలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ఇంకా ఎంత ధాన్యం వచ్చే అవకాశాలున్నాయో అంచనా వేసి అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ధాన్యం కొనుగోలుపై రైతులకు ఎలాంటి సందేహాలున్నా ప్రత్యేక కంట్రోల్ రూమ్ నెంబర్ 79950 50789ను సంప్రదించాలని సూచించారు ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ కె. వీరబ్రహ్మాచారి, ఆర్డీవోలు గణేష్, కృష్ణవేణి, అధికారులు ప్రేమ్‌కుమార్, కృష్ణవేణి, పవన్‌కుమార్, మదన్‌గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

తప్పులు దొర్లకుండా ఎంట్రీ చేయాలి

మరిపెడ(ఆంధ్రజ్యోతి) : కుల గణన డాటా సేకరణను అపరేటర్లు ఏ మాత్రం తప్పులు దొర్లకుండా స్పష్టంగా ఎంట్రీ చేయాలని జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ సూచించారు. మరిపెడ మునిసిపల్ కేంద్రంలోని మండల్ పరిషత్, మోడల్ స్కూల్, సెయింట్ ఆగస్టీన్, ట్రైబల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాలలోని కులగణన డాటా ఎంట్రీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డాటా ఎంట్రీ ఆపరేటర్లకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. జిల్లా వ్యాప్తంగా కుల గణన క్షేత్రస్థాయిలో స్వీకరించిన సమాచారాన్ని క్షుణ్ణంగా చూసి ఎంట్రీ చేయాలన్నారు. జడ్పీ సీఈవో పురుషోత్తం, మరిపెడ తహసీల్దార్ డి.సైదులు, డాటా ఎంట్రీ కేంద్రాల ఇన్‌చార్జ్‌లు ఉన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి

భూపాలపల్లి కలెక్టరేట్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో మాట్లాడిన కలెక్టర్‌వసతిగృహాల్లో విద్యార్థులకు అందిస్తున్న భోజనంపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వసతి గృహాలకు సరఫరా అవుతున్న బియ్యం, సరుకుల నాణ్యతను పరిశీలించాలన్నారు. ఆర్ఓ ప్లాంట్ల పనితీరును పరిశీలించి సురక్షిత నీటిని అందించాలన్నారు. వసత గృహాలకు అందించే వస్తువుల్లో ఖచ్చితంగా నాణ్యతను పాటించాలన్నారు. వారానికి 2,3 సార్లు వసతి గృహాలను పరిశీలించాలని ఆదేశించారు. ప్రతి శుక్రవారం ఫుడ్ విత్ చిల్డ్రన్ కార్యక్రమాన్ని నిర్వహించి విద్యార్థులతో కలిసి భోజనం చేసి ఆహార నాణ్యతను పరిశీలించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను, మధ్యాహ్నభోజన సౌకర్యాలు కుడా తనిఖీ చేయాలన్నారు. వసతిగృహాలను తనిఖీలు చేసి సోమవారం నాటికి సమగ్ర సమాచారం అందించాలన్నారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఈడీఎం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఇనుగుర్తిలో కార్యాలయాలను ఏర్పాటు చేయాలని రాస్తారోకో



ఇనుగుర్తిలో రాస్తారోకో నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

ఇనుగుర్తి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలను వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం గ్రామ శాఖ కార్యదర్శి ఆవుల వెంకన్న ఆధ్వర్యంలో శుక్రవారం పెద్దబస్టాండ్ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు మార్తినేని పాపారావు మాట్లాడారు. నూతన మండలంలో కేవలం తహసీల్దార్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసి మిగతా శాఖలను విస్మరించారని అన్నారు. ఏడాది అవుతున్నా అన్నిశాఖల కార్యాలయాలను ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. ఇప్పటికైనా అన్నిశాఖలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి గొడిశాల వెంకన్న, కావటి నర్సయ్య, నీరుటి జలెందర్, సోమారపు ఎల్లయ్య, జల్లె జయరాజ్, గంజి సంజీవ రెడ్డి, బండి సత్యం, మట్టపల్లి నర్సయ్య, సుంకరి చెన్నయ్య పాల్గొన్నారు.

ఇన్‌ఫార్మర్ నెపంతో హత్య చేయడం అన్యాయం

ములుగు కలెక్టరేట్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇన్‌ఫార్మర్ నెపంతో మావోయిస్టులు ఆదివాసీలను హత్య చేయడం అన్యాయమని ఆదివాసీ ఉద్యోగ సంఘాల నాయకులు, తుడుందెబ్బ నాయకులు అన్నారు. ములుగు జిల్లాకేంద్రంలో జరిగిన అత్యవసర సమావేశంలో శుక్రవారం వారు పాల్గొని మాట్లాడారు. నేడు ప్రపంచమంతా విజ్ఞానంవైపు పరుగెడుతుంటే ఆదివాసీ సమాజం ఇప్పుడిప్పుడే చదువు, ఉద్యోగమని ప్రపంచంతో పరుగులు పెట్టడానికి ప్రయత్నిస్తుందని అన్నారు. మావోయిస్టులు ఇన్‌ఫార్మర్ల నెపంతో హత్యలు చేయడం ఆదివాసీ సమాజాన్ని కొంత విస్మయానికి గురిచేస్తోందని అన్నారు. జిల్లాలోని వాజేడు మండలంలో జరిగిన ఇద్దరి హత్యల్లో ఒకరు ఉన్నత విద్యను అభ్యసించి పోటీ పరీక్షల్లో విజయం సాధించి పంచాయతీ సెక్రటరీగా పనిచేస్తున్నాడని, అలాంటి ఆదివాసీ ఉద్యోగిని ఇన్‌ఫార్మర్ పేరుతో చంపడం సరైందికాదని అన్నారు. సమావేశంలో ఆలిండియా ఆదివాసీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ములుగు జిల్లా అధ్యక్షుడు మంకిడి రవి, రాష్ట్ర కార్యదర్శి అన్నవరం రవికాంత్, తుడుందెబ్బ ములుగు డివిజన్ అధ్యక్షుడు, పెసా జిల్లా కార్యదర్శి వజ్జ రాజు, ములుగు మండల అధ్యక్షుడు ఈక కుమార్, ఆదివాసీ విద్యార్థులు వెంకన్న, వినోద్, సత్యనారాయణ, రమేష్ పాల్గొన్నారు.

9 నెలలు.. 8 మంది ఎంపీడీవోలు

- కేసముద్రంలో తరచూ మారుతున్న అధికారులతో గందరగోళం
- మూడేళ్లపాటు శాశ్వతంగా నియమించాలంటున్న ప్రజలు

కేసముద్రం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయానికి ఏమైందో ఏమోగాని, తొమ్మిదినెలల్లో 8మంది ఎంపీడీవోలు మారారు. తరచూ అధికారులను మారుస్తుండడంతో జిల్లా ఉన్నతాధికారుల తీరుపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కేసముద్రం మండలంలోని గ్రామపంచాయతీల్లో పరిపాలన వ్యవహారాలపై ఆజమాయిషీ ఉండే మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) పోస్టులో అనిచ్ఛితి కొనసాగుతోంది. ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో పోస్టులో తొమ్మిది నెలల వ్యవధిలో.. ఎనిమిది మంది మారడంతో ఎంపీడీవో ఎవరనే విషయం అర్థంకాక ప్రజలు గందరగోళానికి గురవుతున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 12న ఇక్కడ పనిచేసే రెగ్యూలర్ ఎంపీడీవో రవీందర్‌రావు బదిలీ అయ్యారు. అదే నెల 14న సుభాషిణి ఎంపీడీవోగా బదిలీపై వచ్చి, విధుల్లో చేరిన మరుసటి రోజే మెడికల్ లీవ్‌పై వెళ్లారు. ఆ తర్వాత ఫిబ్రవరి 16న కార్యాలయ సూపరింటెండెంట్ పి.సూర్యప్రకాష్‌కు ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా బాధ్యతలను జిల్లా అధికారులు అప్పగించారు. అదే నెల ఫిబ్రవరి 25న సూర్యప్రకాశ్ స్థానంలో దంతాలపల్లి ఎంపీడీవో ఎస్.వి వేక్‌రామ్ డిప్యూటేషన్‌పై ఇక్కడకు వచ్చి విధుల్లో చేరారు. మళ్లీ ఏమైందో ఏమోగాని ఆయన డిప్యూటేషన్‌ను మార్చి 6న రద్దు చేశారు. ఆ తర్వాత మార్చి 9న మహబూబాబాద్ ఎంపీడీవో బి.రవికుమార్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలను అప్పగించారు. ఐదు నెలల అనంతరం ఆగస్టు 6న ఎంపీవోగా హరిప్రసాద్‌ను బదిలీ చేసి ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా నియమించారు. సరిగ్గా నెల రోజుల తర్వాత సెప్టెంబర్ 6న ఉదయశ్రీ బదిలీపై వచ్చి, ఎంపీడీవో స్థానంలో చేరారు.

తాజాగా గురువారం రాత్రి నిజామాబాద్ నుంచి జె.క్రాంతి బదిలీపై ఇక్కడికి వచ్చి ఎంపీడీవోగా విధుల్లో చేరారు. ఇలా తొమ్మిది నెలల వ్యవధిలో కేసముద్రం మండల పరిషత్ కార్యాలయంలో ఎనిమిది మంది ఎంపీడీవోలను జిల్లా అధికారులు మార్చారు. దీంతో కార్యాలయానికి వివిధ సమస్యలపై వచ్చే ప్రజలకు అసలు ఎంపీడీవో ఎవరో..? తెలియని పరిస్థితి నెలకొంది. జిల్లాలో ప్రముఖ పారిశ్రామిక కేంద్రంగా ఉన్న కేసముద్రం మండలానికి కొద్దికాలంపాటు పనిచేసే విధంగా ఎంపీడీవో ఉంటేనే మండల పరిషత్ నిర్వహణ, పాలన వ్యవహారాలు సక్రమంగా కొనసాగుతాయని పలువురు చెబుతున్నారు.

తాజాగా నిర్వహిస్తున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే వివరాల సేకరణ, ఆన్‌లైన్ చేయడంలాంటి బాధ్యతతో పాటు త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో రిటర్నింగ్ అధికారిగా ఎంపీడీవోదే కీలకమైన పాత్ర. గత పదేళ్లలో ఎన్నడూ లేని విధంగా ఈ ప్రభుత్వ హయాంలోనే ఇక్కడ తరచూ ఎంపీడీవోలను మార్చడంపై జిల్లా అధికారుల తీరుపై అధికార పార్టీ నాయకులు సైతం అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కేసముద్రంలో ఎంపీడీవోను తరచు మార్చకుండా రెండుమూడేళ్లు ఉండేలా నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



ఎంపీడీవో ఎవరో తెలియని పరిస్థితి నెలకొంది

గుగులోత్ రాంజీనాయక్, మహమూద్‌పట్నం



కేసముద్రం మండల పరిషత్ కార్యాలయంలో తొమ్మిది నెలలుగా ఎంపీడీవోలు తరచూ మారుతుండడంతో ప్రజలకు ఎవరు ఎంపీడీవో అనేది తెలియడంలేదు. తరచూ మారుస్తుండడం వల్ల ప్రజలు గందరగోళానికి గురవుతున్నారు. మూడేళ్ల వరకు ఎంపీడీవోను మార్చకుండా జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలి.

ఎమ్మెల్సీ ఛాన్స్.. ఎవరికో?

(5వ పేజీ తరువాయి)

2009లో నియోజకవర్గాల పునర్విభజనలో చేర్యాల కనుమరుగవటంతో జనగామ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమిపాలయ్యారు. సీఎం రేవంత్‌రెడ్డితో ఉన్న సన్నిహిత సంబధాలతో పాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని నియోజకవర్గంలో దీటుగా ఎదుర్కొనేందుకు కొమ్మూరికి ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలనే ఒత్తిడి ఆయన వర్గీయుల నుంచి అధిష్ఠానంపై ఉన్నట్టు సమాచారం. కొమ్మూరి కూడా వచ్చే ఎన్నికల నాటికి తన కుమారుడు కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డిని క్రియాశీలక రాజకీయాల్లోకి తీసుకవచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. తొలుత జనగామ జడ్పీ చైర్మన్ పీఠం లక్ష్యంగా ప్రశాంత్‌రెడ్డి లేదంటే ఆయన సతీమణిని బరిలో దించాలనే ఒత్తిడి కొమ్మూరి వర్గీయుల నుంచి ఉందనే చర్చ జరుగుతుంది. అలాగే గత అసెంబ్లీ ఎన్నికల్లో పాలకుర్తి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు తీవ్రంగా ప్రయత్నించిన మామిండ్ల ఝూన్సీరెడ్డి పేరు కూడా ఎమ్మెల్సీ జాబితాలో వినిపిస్తోంది. పాలకుర్తిలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుకు దీటుగా రాజకీయాలు చేసేందుకు ఝూన్సీరెడ్డికి పదవి ఇవ్వాలనే ఒత్తిడి అధిష్ఠానంపై పలువురు ఎమ్మెల్యేలు తీసుకొస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఒకవేళ ఎమ్మెల్సీ పదవి దక్కకపోతే.. నామినేటెడ్ పోస్టు అయినా ఝూన్సీరెడ్డికి ఇచ్చే అవకాశాలున్నాయనే చర్చ ఉంది. ఝూన్సీరెడ్డి మాత్రం ఎమ్మెల్సీ పదవి రాకపోతే జనగామ జడ్పీ చైర్‌పర్సన్ సీటుపై ఫోకస్ చేస్తారని భావిస్తున్నారు. ఇక స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గం నుంచి గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఓడిపోయిన శనిగరపు ఇందిరా పేరు కూడా ఎమ్మెల్సీ రేసులో ప్రముఖంగా వినిపిస్తోంది. బీఆర్ఎస్ నుంచి గెలిచిన కడియం శ్రీహరి కాంగ్రెస్ గూటికి చేరటంతో ఇందిరా వర్గంలో అసంతృప్తి నెలకొంది. శ్రీహరి చేరిక సమయంలోనూ పదవిపై అధిష్ఠానం ఇందిరాకు హామీ ఇచ్చింది. ఇప్పటికే ఏఐసీసీ నేత ఖర్గే, కేసీ వేణుగోపాల్ తదితర నేతలను కలిసి తన రాజకీయ భవిష్యత్తుపై ఆందోళన వ్యక్తం చేసినట్టు సమాచారం. దీంతో ఎమ్మెల్సీ లేదా కీలకమైన నామినేటెడ్ పోస్టుపై ఏఐసీసీ నేతలు హామీ ఇచ్చినట్టు తెలిసింది. దీంతో ఎమ్మెల్సీ లేదంటే ఏదైనా కీలకమైన పదవి ఇందిరా దక్కే చాన్స్ ఉందనే టాక్ వినబడుతోంది. వీరితో మరో అరడజను మందికి పైగా కాంగ్రెస్ సీనియర్ నేతలు ఎమ్మెల్సీ సీటుపై ఆశలతో అధిష్ఠానం ఒత్తిడి తెస్తున్నారు. దీంతో శాసన మండలిలో అధ్యక్షా అనే అదృష్టం ఎవరిని వరిస్తుందో అనే చర్చ కాంగ్రెస్ వర్గాల్లో జోరుగా జరుగుతోంది.

ప్రారంభమైన అయ్యప్ప దీక్షలు

వరంగల్ కల్చరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): అయ్యప్ప స్వాముల మాలధారణ దీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. నగరంలోని భద్రకాళి అమ్మవారి ఆలయానికి వెళ్లే మార్గంలో శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప భక్త సేవాశ్రమంలో ఆశ్రమ వ్యవస్థాపక నిర్వాహకుడు బ్రహ్మశ్రీ టీఆర్ బాలసుబ్రహ్మణ్యశర్మ, గణపతిశర్మ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వాములకు మాలధారణ చేయించారు. పలువురు చిన్న వయసు వారు సైతం దీక్ష చేపట్టడం విశేషం.

స్వయం సంఘాలకు సోలార్ ప్లాంట్లు

- ఎస్‌హెచ్‌జీలకు అప్పగించేందుకు సర్కారు ఏర్పాట్లు
- రేవంత్ సమక్షంలో కుదిరిన త్రైపాక్షిక ఒప్పందం
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 54 మెగావాట్ల ఉత్పత్తికి కసరత్తు



హనుమకొండ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మహిళలను పారిశ్రామికవేత్తలుగా చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా స్వయం సహాయక సంఘాల(ఎస్‌హెచ్‌జీ) ద్వారా సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తోంది. ఆదానీ, అంబానీలకే ఇప్పటి వరకు పరిమితమైన సోలార్ విద్యుత్ ఉత్పత్తిని ఇక నుంచి స్వయం సహాయక సంఘాల్లో సభ్యులైన మహిళలు కూడా చేయొచ్చని ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్‌లో జరిగిన ఇందిరా మహిళా శక్తి విజయోత్సవ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించింది తెలిసిందే. ఎస్‌హెచ్‌జీ గ్రూపుల సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకునేందుకు వీలుగా ఇదే విజయోత్సవ సభలో సీఎం సమక్షంలో సెర్ప్, రెడ్కో, డిస్కమ్‌ల మధ్య కుదిరిన ఎంఓయూల ఆదాన ప్రదానం జరిగింది తెలిసిందే. వరంగల్ గడ్డపై నుంచే ఈ వినూత్న పథకానికి సీఎం శ్రీకారం చుట్టడంతో దీనిని విజయవంతం చేయడానికి జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ రెడ్కో, టీఎస్ఎన్‌పీడీసీఎల్ అధికారులు కసరత్తు చేస్తున్నారు.



పీచరలోని సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు కానున్న సోలార్ ప్లాంట్

కొత్తకొండ, పీచరలో..

హనుమకొండ జిల్లాలో 9 మెగావాట్ల సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు 18 ఎకరాల భూ సేకరణకు డీఆర్‌డీఏ అధికారులు ప్రతిపాదనలు పంపించారు. భీమదేవరపల్లి మండలంలోని కొత్తకొండ సబ్‌స్టేషన్, వేలేరు మండలం పీచర సబ్ స్టేషన్ పరిధిలో అనువైన స్థలం అందుబాటులో ఉన్నట్టు ప్రాథమికంగా గుర్తించారు. మరికొన్ని చోట్ల కూడా స్థల పరిశీలన జరుగుతోంది. అయితే సబ్ స్టేషన్లకు సమీపంలో ప్రభుత్వ స్థలాలు అందుబాటులో ఉన్నచోట అక్కడికి వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం లేకపోవడం, కొన్ని చోట్ల రాళ్ల రప్పలు ఉండడం, మరికొన్ని చోట్ల గుంతలమయంగా ఉండడం వల్ల అవి ప్లాంట్ల ఏర్పాటుకు అనువుగా లేవు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా డిసెంబర్ 9వ తేదీన విజయోత్సవం జరిగేనాటికల్లా తొలి విడతగా కనీసం రెండు మూడు సోలార్ ప్లాంట్లయినా ఏర్పాటు అయ్యేలా కసరత్తు జరుగుతోంది.

ఉమ్మడి జిల్లాకు 54 మెగావాట్లు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 54 మెగావాట్ల మేరకు సోలార్ పవర్‌ను ఉత్పత్తి చేసేందుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ జిల్లాల్లో 9 మెగావాట్ల చొప్పున ఉత్పత్తికి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఆ మేరకు ముందుకు వచ్చే స్వయం సహాయక సంఘాలకు చేయూత నిచ్చేందుకు సిద్ధంగా ఉన్నది. ఒక యూనిట్ సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు సుమారు రూ.3.50కోట్ల నుంచి రూ.4 కోట్ల వరకు అవసరమవుతుంది. ఈమొత్తంలో ఎస్‌హెచ్‌జీ 10 శాతం సమకూర్చితే మిగతా మొత్తాన్ని బ్యాంకులు రుణంగా ఇస్తాయి. దీనిని నెలవారిగా చెల్లించాల్సి ఉంటుంది. సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు అవసరమైన ఉపకరణాలను రెడ్కో 30శాతం సబ్సిడీపై ఎస్‌జీహెచ్‌లకు సరఫరా చేస్తుంది. ఒక మెగావాట్ సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు గరిష్ఠంగా రెండెకరాల స్థలం అవసరమవుతుంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 54 ప్లాట్ల స్థాపనకు 108 ఎకరాల స్థలం అవసరమవుతుంది. ప్లాంట్ల ఏర్పాటుకు అవసరమైన స్థలం కోసం డీఆర్‌డీఏ అధికారులు అన్వేషిస్తున్నారు. ప్లాంట్ ఏర్పాటు చేసే స్థలం సమీప సబ్‌స్టేషన్‌కు రెండు కిలోమీటర్ల పరిధిలో ఉండాలి. ఆ స్థలం వద్దకు వెళ్లడానికి సరైన రహదారి ఉండాలి. స్థలం చదునుగా ప్లాంట్ ఏర్పాటుకు అనువుగా ఉండాలి. సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు కావలసిన స్థలాన్ని ప్రభుత్వమే సమకూరుస్తుంది. ఇందుకు 30 ఏళ్ల కాలపరిమితితో స్థలాన్ని ప్రభుత్వం ఎస్ఎచ్‌జీకి లీజుకు ఇస్తుంది. ప్రభుత్వ స్థలాలు లేని చోట దేవాదాయ శాఖకు చెందిన భూములను కూడా వినియోగించుకునేందుకు అవకాశం కల్పించారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలో ప్లాంట్ల ఏర్పాటుకు అందుబాటులో ఉన్న అనువైన భూముల పరిశీలన చేయడం కూడా పూర్తయింది. ఈ మేర కు దేవాదాయ శాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదిక కూడా సమర్పించారు.

ఏడాదికి రూ.30లక్షల ఆదాయం

సోలార్ పవర్ ప్లాంట్ల ద్వారా మహిళలకు నెలకు రూ.2.5 లక్షల చొప్పున ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నారు. అంటే యేడాదికి రూ.30లక్షలు వస్తాయి. ఒక స్వయం సహాయక బృందంలోని 10 మంది మహిళలు కలిసి ఒక సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేసుకుంటే ఇంత ఆదాయం వస్తుంది. సోలార్ ప్లాంట్ల ద్వారా ఉత్పత్తి అయిన విద్యుత్‌ను డిస్కంలకు అమ్ముకోవచ్చు. ఇందుకు డిస్కమ్‌లు ప్రస్తుతం యూనిట్‌కు రూ.3.13 చొప్పున చెల్లిస్తున్నాయి. నెలవారీ ఉత్పత్తి అయ్యే కరెంట్‌ను డిస్కంలు కొనేలా ప్రభుత్వం ఏర్పాటు కూడా చేసింది. అందువల్ల కరెంట్‌ను ఎవరు కొంటారనే ఆందోళన అక్కర్లేదు. ఈ మేరకు ఏజెన్సీగా రెడ్కో, గ్రామీణ దారిద్ర్య నిర్మూలనా సంస్థ(సెర్ప్), రెండు డిస్కమ్‌లు టీఎస్ఎన్‌పీడీసీఎల్, టీఎస్ఎస్‌పీడీసీఎల్‌లు అవగాహనా ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు ఇంధన శాఖ అనుమతిస్తుంది. అది కూడా ఇచ్చేలా ప్రభుత్వమే చేస్తుంది. అనుమతి ఇచ్చాక రెడ్కో మూడు రోజుల్లో సోలార్ ప్లేట్లను అమర్చి ప్లాంట్‌ను సిద్ధంచేసి ఎస్‌హెచ్‌జీకి అప్పగిస్తుంది. ఒకసారి ప్లాంట్‌ను ఏర్పాటుచేసుకుంటే పెద్దగాఖర్చు లేకుండా 20-25ఏళ్లపాటు నిర్వహించవచ్చు.

కొనుగోలు ఇలా..

సోలార్ ప్లాంట్లను వాటి పరిధిలోని సమీప సబ్‌స్టేషన్‌కు అనుసంధానిస్తారు. ప్లాంట్‌లో ఉత్పత్తి అయిన సౌరవిద్యుత్‌ను సబ్‌స్టేషన్ స్వీకరిస్తుంది. అక్కడి నుంచి గ్రిడ్‌కు వెళతుంది. ప్లాంట్ నుంచి ఎంత సోలార్ పవర్ తీసుకున్నది నెట్‌మీటర్ ఎప్పటికప్పుడు రికార్డు చేస్తుంది. దీనిని బట్టి బిల్లు చెల్లింపు జరుగుతుంది. ఎస్‌హెచ్‌జీలకు ఆరునెలలకోసారి కాకుండా ప్రతీ నెల చెల్లించనున్నట్టు సమాచారం. ఎస్‌హెచ్‌జీలకు నెలకు రూ.2.5 లక్షల నుంచి రూ.3లక్షల వరకు ఆదాయం సమకూరనున్నది. ఈ మొత్తంలో నుంచి లోన్ ఇన్‌స్టాల్‌మెంట్ పోను మిగిలినది గ్రూప్ సభ్యులు పంచుకుంటారు. ప్లాంట్ల ద్వారా స్థిరమైన ఆదాయం రావడం వల్ల గ్రూప్ సభ్యుల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడే అవకాశం ఉంది. వచ్చిన ఆదాయం నుంచే పెట్టుబడి పెట్టి ప్లాంట్లను విస్తరించినట్లయితే మరింత ఆదాయం సమకూరి భవిష్యత్తులో వారు పారిశ్రామికవేత్తలుగా ఎదిగే అవకాశం ఉంది.

మహిళలు పారిశ్రామికవేత్తలవుతారు..

మేన శ్రీను, ప్రాజెక్టు డైరెక్టర్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, హనుమకొండ



స్వయం సహాయక సంఘాల ద్వారా సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటు నిర్ణయం చాలా అద్భుతమైనది. విప్లవాత్మకమైనది. ఎస్‌హెచ్‌జీ గ్రూప్‌లోని మహిళలు ఆర్థికంగా బలపేడేందుకు అవకాశం ఉంది. ప్లాంట్ల ద్వారా స్థిరమైన ఆదాయం సమకూరనుండడంతో వారు భవిష్యత్తులో తమ ప్లాంట్లను మరింతగా విస్తరించి పారిశ్రామికవేత్తలుగా ఎదగగలుగుతారు. ప్రతీ మహిళ కోటీశ్వరురాలు కావాలన్న ప్రభుత్వ సంకల్పం ఈ విధంగా నెరవేరనున్నది. హనుమకొండ జిల్లాలో 9 మెగావాట్ల సోలార్ పవర్ ఉత్పత్తికి కేటాయింపు లభించింది. ప్లాంట్ల ఏర్పాటుకు 18 ఎకరాల స్థల సేకరణకు ప్రతిపాదనలు పంపాం. అనువైన స్థలాల కోసం పరిశీలన జరుపుతున్నాం.

అర్ధరాత్రి అలజడి..

- వాజేడులో మావోయిస్టుల ఘాతుకం
- పోలీసు ఇన్‌ఫార్మర్ల నెపంతో ఇద్దరి హత్య
- మారణాయుధాలతో దాడి చేసి హతమార్చిన వైనం
- మృతుల్లో ఒకరు పంచాయతీ కార్యదర్శి, మరొకరు కూలీ
- న్యాయం చేయాలని మృతదేహాలతో కుటుంబీకుల ధర్నా



రమేష్ నూతన గృహం వద్ద రోదిస్తున్న బంధువులు

వాజేడు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మన్యం ప్రాంతమైన ములుగు జిల్లా వాజేడు మండల కేంద్రంలోని పెనుగోలు కాలనీలో మావోయిస్టులు అర్ధరాత్రి సమయంలో అలజడి సృష్టించారు. పోలీసు ఇన్‌ఫార్మర్లుగా వ్యవహరిస్తున్నారన్న నెపంతో వరుసకు సోదరులైన ఇద్దరిపై మారణయుధాలతో దాడి చేసి కిరాతకంగా హతమార్చారు. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ ఘటనలో పంచాయతీ కార్యదర్శి ఉయిక రమేష్(37)తో పాటు అతడి పెదనాన్న కుమారుడైన ఉయిక అర్జున్(41) మృతిచెందారు. స్థానికులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం అర్ధరాత్రి 11గంటల సమయంలో రమేష్, అర్జున్ ఇద్దరు ఎవరిళ్లల్లో వారు నిద్రిస్తుండగా.. ఆలీవ్‌గ్రీన్ దుస్తులు ధరించిన మావోయిస్టులు ముగ్గురు చొప్పున రెండు బృందాలుగా ఏక కాలంలో వారిళ్లలో ప్రవేశించారు. పరదా చించివేసి ఉయిక రమేష్ ఇంట్లోకి ప్రవేశించిన మావోయిస్టులు గాఢ నిద్రలో ఉన్న రమేష్ తలపై గొడ్డలితో దాడి చేయగా ఆ అలజడికి నిద్ర నుంచి లేచిన రమేష్ భార్య రాంబాయి మావోయిస్టులను ప్రతిఘటించి భర్తను కాపాడుకునే ప్రయత్నం చేసింది. ఈ క్రమంలో ఆమెను పక్కకు నెట్టివేసిన మావోయిస్టులు రమేష్‌పై గొడ్డలి, కత్తులతో దాడి చేసి తీవ్రంగా గాయపర్చి వెళ్లిపోయారు. రమేష్ భార్య కేకలు వేయగా రమేష్ తల్లిదండ్రులు కూడా అక్కడికి వచ్చారు. వారి ఏడుపులు, అరుపులతో చుట్టుపక్కల వారు వచ్చి రమేష్‌ను 108లో ఏటూరనాగారం తరలించగా చికిత్స అందిస్తున్న క్రమంలో మృతిచెందాడు. ఇక రమేష్ ఇంటికి సుమారు 100 మీటర్ల దూరంలోనే నివాసం ఉండే ఉయిక అర్జున్ ఇంట్లో నిద్రిస్తుండగా.. ఇంటి బయట అతడి భార్య సావిత్రి నిద్రిస్తోంది. ఈ క్రమంలో కత్తులు, గొడ్డలితో వచ్చిన మావోయిస్టులు బయటపడుకుంది అర్జునే అని భావించారు. కానీ దాడి చేసే ముందు లైట్ వేయగా అక్కడ ఉన్నది అర్జున్ భార్య అని గుర్తించి.. అర్జున్‌లో లోపల ఉన్నాడని నిర్ధారించుకుని తలుపులను పగులగొట్టి లోనికి ప్రవేశించారు. ఈ అలజడికి నిద్రలో నుంచి మేల్కొన్న అర్జున్‌ను బయటకు లాక్కొచ్చి గొడ్డలితో మెడపై, నడుము భాగంలో తీవ్రంగా పొడవడంతో అర్జున్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ జంట హత్యల తర్వాత మావోయిస్టులు అక్కడి నుంచి సమీప అటవీ ప్రాంతంలోకి వెళ్లిపోయారని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. అనంతరం మృతదేహాలకు ఏటూరునాగారం ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించగా.. పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెనుగోలు నుంచి ఏకైక ప్రభుత్వ ఉద్యోగి..

తెలంగాణ - ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అటవీ ప్రాంతంలోని పెనుగోలు గుట్టలు ఉన్నాయి. ఆ గిరిజన గూడేనికి రహదారి మార్గం లేదు. వాజేడు నుంచి సుమారు 17కిలోమీటర్లు కాలినడకన మూడు వాగులు, నాలుగు గుట్టులు దాటుకుంటూ అక్కడికి చేరుకోవాలి. అలాంటి మారుమూల కుగ్రామం నుంచి ఉయిక రమేష్ ప్రభుత్వ కొలువు సాధించి అందరికీ ఆదర్శంగా నిలిచాడు. గుట్టలు దిగి వసతిగృహాల్లో ఉంటూ డిగ్రీ, బీఈడీ విద్యను అభ్యసించి 2019లో పంచాయతీ కార్యదర్శిగా కొలువు సాధించి మండలంలోని పేరూరు జీపీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నాడు. మండల కేంద్రంలోని పెనుగోలు కాలనీలో సొంత ఇల్లు నిర్మించుకుంటున్న రమేష్ ఆ ఇంట్లో గృహ ప్రవేశం చేసేందుకు సన్నాహాలు చేస్తున్న క్రమంలో మావోయిస్టులు హత్య చేయడం సంచలనంగా మారింది.

గిరిజనులను గుట్టలు దింపేందుకు ఏళ్లుగా ప్రయత్నాలు..

పెనుగోలు గుట్టల్లో నివాసముంటున్న సుమారు 60కుటుంబాల్లో 15 ఏళ్ల క్రితం 30కుటుంబాలు గుట్టలు దిగి రాగా గత ఆరేళ్లల్లో మరో 20 కుటుంబాల వరకు మండల కేంద్రంలోని పెనుగోలు కాలనీకి చేరుకున్నాయి. మిగిలిన 10 కుటుంబాలను కూడా కిందకు దించేందుకు అధికారులు పలుమార్లు ప్రయత్నించారు. ఈ క్రమంలో ఆగస్టులో మంత్రి సీతక్క కూడా వారికి ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని, కిందకు వచ్చేందుకు వారితో మాట్లాడుతున్నామని ప్రకటించారు. ఈ క్రమంలో పెనుగోలు గుట్టలు కొంత కాలం నుంచి మావోయిస్టులకు షెల్టర్ జోన్‌గా ఉన్నాయి. ఉన్న 10 కుటుంబాలు కూడా కిందకు దిగితే మావోయిస్టులకు ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. అయితే ఆ కుటుంబాలను కిందకు దించేందుకు ఉయిక రమేష్ ఒత్తిడి చేస్తున్నాడని, పలుమార్లు హెచ్చరించినా పట్టించుకోకపోవడంతో రమేష్ ఖతం చేస్తున్నామని మావోయిస్టులు రమేష్ మృతదేహం వద్ద వదిలిన లేఖలో పేర్కొనడం గమనార్హం. పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న రమేష్ పోలీసులకు సహకరిస్తున్నాడని, గుట్టలపై తమ దళాల సమాచారాన్ని ఎప్పటికప్పుడు వారికి చేరవేస్తున్నాడని, ఈ విషయంపై పలుమార్లు హెచ్చరించినా తీరు మార్చుకోలేదన్న కోపంతో మావోయిస్టులు హతమార్చినట్లు స్పష్టమవుతోంది. ఇదే సమయంలో రమేష్ పెదనాన్న కొడుకైన ఉయిక అర్జున్‌ను కూడా హతమార్చడం సంచలనంగా మారింది.

ఉలిక్కిపడ్డ వాజేడు..

మావోయిస్టులు ఒకే రోజు ఇద్దరు వ్యక్తుల్ని హతమార్చడంతో వాజేడు మండలంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలు ఉలిక్కిపడ్డాయి. 1987లో వాజేడుకు చెందిన బుద్దరాజు సీతాపతిరాజును ఇంటి వద్దను హత్య చేయడం అప్పట్లో పెను సంచలనమైంది. అనంతరం 2007లో దంతులూరి తిరుపతిరాజును దూలాపురంలో ఉదయం పూటే ట్రాక్టరులో ఉండగానే మావోయిస్టులు చంపేశారు. అనంతరం 2012లో పేరూరులో ఓ ఆర్ఎంపీ డాక్టరును హతమార్చిన మావోయిస్టులు వాజేడులో కార్యకలాపాలు చేయలేదు. ఇన్నేళ్ల అనంతరం పోలీస్ స్టేషన్‌కు కూత వేటు దూరంలో ఒకే రోజు ఇద్దరు ఆదివాసీలను హతమార్చడంతో ఏజెన్సీ వాసులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ ఘటనతో ఏజెన్సీలోని వాజేడు, వెంకటాపురం మండలాల్లో మావోయిస్టులకు టార్గెట్‌గా ఉన్న నేతలు, వ్యాపారస్థులు ఉలిక్కిపడ్డారు. సురక్షిత ప్రాంతంగా ఉన్న వాజేడులో మావోయిస్టులు పోలీస్‌స్టేషన్‌కు కూత వేటు దూరంలో జంటహత్యలకు పాల్పడడంతో టార్గెట్ నేతలతో పాటు అధికార, ప్రతిపక్ష నాయకులను పోలీసులు అప్రమత్తం చేస్తుండగా వారంతా సురక్షిత ప్రాంతాలకు తరలేప్రయత్నం చేస్తున్నట్టు సమాచారం.



ఇంటి వద్ద రోదిస్తున్న అర్జున్ భార్య, బంధువులు

ఉనికి కోసమే ఆదివాసీలపై మావోల దాడులు : ఎస్పీ శబరీష్

ములుగు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కోల్పోయిన ఉనికిని కాపాడుకునేందుకు మావోయిస్టులు ఆదివాసీలపై అఘాయిత్యాలకు పాల్పడుతున్నారని ములుగు ఎస్పీ శబరీశ్ తెలిపారు. తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుగా ఉన్న ములుగు జిల్లాలోని కర్రెగుట్ట అటవీ ప్రాంతాన్ని గెరిల్లాబేస్‌గా మార్చే యత్నంలో భాగంగా వరుస దాడులు చేస్తున్నారని పేర్కొన్నారు. వాజేడులో ఇరువురిని మావోయిస్టులు హత్య చేసిన నేపథ్యంలో ఎస్పీ స్పందించారు. మీడియాకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కనీస వసతులు లేని మారుమూల గ్రామమైన పెనుగోలుకు చెందిన ఉయిక రమేష్ కష్టపడి చదువుకుని పంచాయతీ కార్యదర్శి ఉద్యోగం పొందాడని, విద్యావంతుడైన ఆదివాసీ యువకుడిని మావోయిస్టు పార్టీకి సహకరించాలని ఒత్తిడి చేశారని తెలిపారు. అటవీ ఉత్పత్తుల సేకరణపై జీవనాధారంగా బతుకుతున్న అర్జున్‌ను పార్టీలో చేరాలని ఒత్తిడి చేశారని తెలిపారు. దీంతో వారు పెనుగోలును వదిలివచ్చారన్నారు. తమకు సహకరించడంలేదనే నెపంతో ఈ ఇద్దరిపై పోలీస్ ఇన్‌ఫార్మర్ ముద్ర వేసి పాశవికంగా హత్య చేశారన్నారు. ఈ ఘటనపై పౌర హక్కుల సంఘాలు స్పందించాలన్నారు. వాజేడు మండలం జగన్నాథపురం గ్రామానికి చెందిన ఇల్లందుల యేసు అనే వ్యక్తి గతంలో మందుపాతర పేలిన ఘటనలో మరణించాడని, మరో ఘటనలో వెంకటాపురం మండలానికి చెందిన డర్రా సునీత అనే మహిళ మందుపాతర పేలి వికలాంగురాలిగా మారిందని ఎస్పీ వెల్లడించారు.



వాజేడు-జగన్నాథపురం ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

న్యాయం చేయాలని కుటుంబసభ్యుల ధర్నా

మావోయిస్టులు హతమార్చిన ఇద్దరి కుటుంబాలు పెద్ద దిక్కును కోల్పోయాయి. మృతిచెందిన రమేష్‌కు భార్యతో పాటు ఇద్దరు అబ్బాయిలు, చిన్న పాప ఉంది. అలాగే అర్జున్‌కు భార్య సావిత్రితో పాటు ముగ్గురు అమ్మాయిలున్నారు. పెద్ద అమ్మాయి ఇంటర్, రెండో, మూడో అమ్మాయి పది, ఎనిమిది తరగతులను వసతి గృహాల్లో ఉంటూ చదువుకుంటున్నారు. అర్జున్ తన కుమార్తెలను కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో ఇంటి పెద్ద దిక్కును కోల్పోయిన ఆ కుటుంబాలు రోదిస్తున్న రోదనలు మిన్నంటాయి. కుటుంబ పెద్దలను కోల్పోయిన తమకు న్యాయం చేయాలంటూ రమేష్, అర్జున్ కుటుంబాలు మృతదేహాలతో వాజేడు-జగన్నాథ పురం ప్రధాన రహదారి శుక్రవారం సాయంత్రం ధర్నా చేపట్టారు. అమాయక ఆదివాసీలను పొట్టన పెట్టుకోవడం మావోయిస్టులకు తగదన్నారు. పోలీసుల వైఖరిపై సైతం బాధిత కుటాంబాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. అర్ధరాత్రి జరి గిన హత్యలపై పోలీసులకు సమాచారం ఉన్నా సంఘటనా స్థలానికి రాకపోవ డమేంటని ప్రశ్నించారు. పోస్టుమార్టం చేయించడంలోనూ పోలీసులు నిర్లక్ష్యం చేశారంటూ అసహనం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా మృతదేహాలతో జాతీ య రహదారిపై ఆందోళనకు బయలుదేరిన బాధిత కుటుంబ సభ్యులు, స్థాని కులకు వెంకటాపురం సీఐ బండారి కుమార్, ఎస్సైలు హరీష్, తిరుపతిరావు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ప్రభుత్వం తరఫున రెండు కుటుంబాలకు రూ25లక్షలు చొప్పున నగదు, రెండు కుటుంబాలలో ఎవరికైనా రెండు ఉద్యోగాలు ఇచ్చేందుకు జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడతామని హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు.



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సీఐ కుమార్

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లలో భారీగా తిరస్కరణ

- దరఖాస్తులో పొరపాట్ల కారణంగా 5,380 దరఖాస్తుల తిరస్కరణ
- నేటి నుంచి మరో అవకాశం

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ- వరంగల్ - ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు వచ్చే ఏడాది మార్చి నెలలో జరగనున్నాయి. ఇందు కోసం ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. ఈనెల 6 వరకే ఎన్‌రోల్‌మెంట్ గడువు ముగిసింది. అయితే ఉమ్మడి వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల పరిధిలో 28,658 మంది ఉపాధ్యాయ, అధ్యాపకులు ఓటర్లుగా నమోదు చేసుకోగా, 23,278 దరఖాస్తులు ఆమోదయోగ్యమయ్యాయి. ఇక 5,380 మంది దరఖాస్తులు వివిధ కారణాలతో తిరస్కరణకు గురయ్యాయి. అయితే ఉపాధ్యాయ, అధ్యాపకులతో పాటు ఆశావహ అభ్యర్థులు కొంత మందివి దరఖాస్తు చేశారు. ఇందులో భారీగానే తప్పులు దొర్లినట్లు తెలుస్తోంది. దీంతో ఈసారి భారీగా తిరస్కరణకు గురికావడంతో ఎన్నికల కమిషన్ ఈ నెల 23 నుంచి మరోసారి అవకాశం కల్పించింది.

అసంపూర్తి దరఖాస్తుల తిరస్కరణ

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియలో చాలా దరఖాస్తులు అసంపూర్తిగా ఉండటంతో తిరస్కరణకు గురయ్యాయి. సమర్పించిన దరఖాస్తుల్లో కౌంటర్ సంతకాలు, హెచ్‌వోడీల సంతకాలు లేకపోవడంతో అనేక మంది దరఖాస్తులు తిరస్కరణకు గురయిన ట్లు తెలుస్తోంది. ఉపాధ్యాయ, అధ్యాపకులు చేసుకున్న దరఖాస్తుల్లో ఆరోవంతు తిరస్కరణకు గురికావడంతో ఒకానొక దశలో ఇప్పటికే పోటీలో ఉన్న అభ్యర్థులతో పాటు ఆశావహ అభ్యర్థులు ఆందోళనకు గురయ్యారు. అయితే ఎన్నికల కమిషన్ ప్రకటనతో వారు ఊపిరి పీల్చుకుంటున్నారు.

నేటి నుంచి మరో అవకాశం

దరఖాస్తుల్లో దొర్లిన తప్పులతో భారీగా తిరస్కరణకు గురికావడంతో ఆలోచించిన ఎన్నికల కమిషన్.. మరోసారి దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కల్పించింది. ఈనెల 23 నుంచి తిరస్కరణకు గురైన దరఖాస్తులతో పాటు ఇప్పటి వరకు దరఖాస్తులు చేసుకోని వారికి అవకాశం కల్పించింది. ఇప్పటికే దరఖాస్తులు చేసుకున్న వారు వారి దరఖాస్తుల స్టేటస్‌ను తెలుసుకొని తిరస్కరణకు గురైన వారు మరోమారు దరఖాస్తు చేసుకోవాలని లేదంటే వారు ఓటు హక్కును కోల్పోయే ప్రమాదముందని ఎమ్మెల్సీ అభ్యర్థులు, ఆశావహులు ఉపాధ్యాయ, అధ్యాపకులను అభ్యర్థిస్తున్నారు.

జిల్లాల వారీగా ఇలా..

జిల్లా పేరు	నమోదు చేసుకున్న ఓట్లు	ఆమోదించినవి	తిరస్కరించినవి
వరంగల్	2,574	1,928	646
హనుమకొండ	5,590	4456	1,134
జనగామ	1,058	829	229
ఖమ్మం	4,378	3,883	495
కొత్తగూడెం	2,252	1,821	431
నల్గొండ	5,372	4,708	664
యాదాద్రి	1,726	839	887
సూర్యాపేట	2,945	2,531	414
భూపాలపల్లి	361	261	100
మహబూబాబాద్	1,525	1,308	217
ములుగు	683	561	122
సిద్దిపేట	194	153	41
మొత్తం	28,658	23,278	5,380

చలి తీవ్రత నేపథ్యంలో జాగ్రత్తలు పాటించాలి

- డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య



వరంగల్ మెడికల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న చలి తీవ్రత వల్ల వృద్ధులు, చిన్న పిల్లల విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవడం అవసరమని హనుమకొండ డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య సూచించారు. చలి తీవ్రత క్రమంగా పెరగడం, ఉష్ణోగ్రతలు పడిపోవడంవల్ల రానున్న రోజుల్లో చలి మరింత పెరిగే అవకాశం ఉండటంతో ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో చలి బారిన పడకుండా తగు జాగ్రత్త చర్యలు పాటించాలని సూచించారు. దగ్గు, ముక్కు కారడం, శ్వాస సంబంధిత సమస్యలు, గొంతు నొప్పి, తుమ్ములు వస్తాయన్నారు. చిన్నారుల ఊరిపితిత్తుల్లో ఇన్‌పెక్షన్ ఏర్పడి నిమోనియా బారిన పడే అవకాశం ఉందని, బ్యాక్టీరియా, ఫంగస్, ప్లోటో జోవన్ల వల్ల శ్వాస సంబంధిత సమస్యలు ఏర్పడతాయని తెలిపారు. రాత్రి సమయంలో చల్లగాలి ఇంట్లోకి రాకుండా కిటికీలు, తలుపులు మూసివేసి వెచ్చదనం కోసం వేడినిచ్చే హైవోల్టేజ్ బల్బులను వాడాలన్నారు. వాకింగ్‌కు వెళ్లేవారు చలి ఎక్కువగా ఉన్నప్పుడు జాగ్రత్తలు పాటించాలని హనుమకొండ డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య సూచించారు.



విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడిస్తున్న తిరుపతిరావు

వ్యవసాయ మోటార్ల చోరీ ముఠా అరెస్టు

● మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు

డోర్నకల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జల్సాలకు అలవాటు పడి, కష్టపడకుండా డబ్బులు సంపాదించడానికి 8 మంది ముఠాగా ఏర్పడి, రైతుల వ్యవసాయ విద్యుత్ మోటార్లను అపహరించుకుపోయి సొమ్ము చేసుకుంటున్నట్లు మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు తెలిపారు. డోర్నకల్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం కేసు వివరాలను వెల్లడించారు. ఖమ్మం జిల్లా బస్వాపురానికి చెందిన కట్ట విజయ్, వట్టికూటి సాయికిరణ్, గొల్లగూడెంకు చెందిన షేక్.మదార్ సాహెబ్, ఆల్లిపురంకు చెందిన వెల్పుల వినేష్, ఖమ్మంకు చెందిన పగిడిపల్లి మహేష్, డోర్నకల్ మండలం తోడేళ్లగూడెంకు చెందిన పిప్పళ్ల జగన్, ఏటూరునాగారం మండల రామన్నగూడెంకు చెందిన అన్నారపు ఉపేందర్, ఖమ్మం బొక్కలగడ్డ బజారుకు చెందిన గోకినపల్లి భరత్‌కుమార్ ముఠాగా ఏర్పడ్డారు. డోర్నకల్, చిన్నగూడూరు మండలాలతోపాటు పలు గ్రామాల్లో, ఖమ్మం జిల్లాలోని చింతకాని, ఖమ్మం రూరల్ పోలీస్‌స్టేషన్‌పరిధిలో వ్యవసాయ బావుల వద్ద ఉన్న మోటార్లను అపహరించుకుపోయేవారు. అలా అపహరించుకుపోయిన మోటార్లను ఇతరులకు అమ్మి సొమ్ము చేసుకునేవారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం మండలంలోని తోడేళ్లగూడెం శివారులో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అటుగా వస్తున్న ఆటోను తనిఖీ చేశారు. అందులో నాలుగు వ్యవసాయ మోటార్లు ఉండడంతో వారిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. దీంతో వారు చేస్తున్న దొంగతనాల గురించి పోలీసులకు చెప్పారు. మొత్తం 21 వ్యవసాయ మోటార్లను చోరీ చేసినట్లు తెలిపారు. మరో 14 మోటార్లను తోడేళ్లగూడెం సమీపంలోని కస్నాతండా వద్ద ఉన్న కోతుల వాగు సమీపంలోని పొదల్లో దాచిపెట్టినట్లు చెప్పారు. పోలీసులు వాటిని స్వాధీనం చేసుకుని రవాణాకు ఉపయోగిస్తున్న ఆటోను సీజ్ చేశారు. నిందితులైన కట్ట విజయ్, వెల్పుల వినేష్, పగిడిపల్లి మహేష్, పిప్పళ్ల జగన్, అన్నారపు ఉపేందర్, గోకినపల్లి భరత్‌కుమార్‌లను అదుపులోకి తీసుకోగా వట్టికూటి సాయికిరణ్, షేక్.మదార్‌సాహెబ్‌లు పరారీలో ఉన్నట్లు చెప్పారు. వారిని కూడ త్వరలో పట్టుకుంటామని డీఎస్పీ స్పష్టం చేశారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించి విద్యుత్ మోటార్ల దొంగతనంకు పాల్పడుతున్న ముఠాను అరెస్టు చేసిన పోలీసులను డీఎస్పీ అభినందించి వారికి రివార్డులను అందజేశారు. ఈ సమావేశంలో డోర్నకల్ సీఐ భూక్య రాజేష్, ఎస్సైలు వంశీధర్, ఉమ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నాడు కళకళ.. నేడు వెలవెల

● విద్యార్థుల్లేక బోసిపోతున్న కామారం ఆశ్రమ పాఠశాల

● 23 మంది స్టూడెంట్స్‌కు 10 మంది టీచర్ల నియామకం

● నలుగురు ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై పంపిన ప్రభుత్వం



కామారం ఆశ్రమ పాఠశాల



విద్యార్థులు లేక వెలవెల పోతున్న తరగతి గది

గంగారం, నవంబరు 22 : ఒకనాడు వందలామంది విద్యార్థులతో కళకళలాడిన కామారం ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల ఇప్పుడు స్టూడెంట్స్ లేక వెలవెల పోతోంది. నేడు ఒక్క విద్యార్థి కూడా హాజరుకాకపోవడంతో బోసిపోయి కనిపిస్తోంది. వివరాల్లోకి వెళ్లితే.. మహబూబాబాద్ జిల్లా ఏజన్సీ ప్రాంతమైన గంగారం మండలంలో మారుమూలనున్న కామారం గిరిజన ఆశ్రమ పాఠశాల దశాబ్దక్రితం వందలాది మంది విద్యార్థులతో సందడిగా ఉండేది. ఈ ఆశ్రమ స్కూల్‌కు సరైన రహదారిలేక పోవటం, బస్ సౌకర్యం లేదు. అలాగే ఉపాధ్యాయులు విధులకు సక్రమంగాహాజరుకాకపోవడంతో.. ఇక్కడి విద్యార్థులు మెరుగైన చదువు కోసం పట్టణాల బాట పట్టారు. ఈ క్రమంలో 2015 నుంచి ఆశ్రమ పాఠశాలకు విద్యార్థుల కొరత ఏర్పడింది.

గంగారం మండలంగా ఏర్పడిన తర్వాత 2017లో అప్పటి తహసీల్దార్ రాంరెడ్డి వెంకటరెడ్డి విద్యార్థులులేని ఆశ్రమ పాఠశాలను మూసివేయాలని ఇచ్చిన నివేదిక మేరకు నాటి కలెక్టర్ ప్రీతిమీనన్ తనిఖీ చేసి, స్టూడెంట్స్ లేకపోవడంతో ఆశ్రమ పాఠశాలను మూసివేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. స్థానిక జడ్పీటీసీ ఈసం రమాకాంతారావు జిల్లా జడ్పీ సమావేశంలో ఇచ్చిన అభ్యర్థన మేరకు 2019లో ముగ్గురు విద్యార్థులతో పాఠశాలను జిల్లా ట్రైబల్ వెల్‌ఫేర్ అధికారులు పునఃప్రారంభించారు. 2020లో విద్యార్థుల సంఖ్య పది దాటినా కరోనా కారణంగా విద్యార్థులు రాక వెలవెలపోయింది. కరోనా తరువాత ఆశ్రమ పాఠ శాలలో 3వ తరగతి నుంచి ఆంగ్లం బోధించాలం టూ ప్రభుత్వం ఆదేసించింది. ఇందుకు 10 మంది ఉపాధ్యాయులను నిమించింది. బడిబాట సమయంలో ఉపాధ్యాయుల నిర్లక్ష్యధోరణి కారణంగా కామారం పాఠశాలకు విద్యార్థుల కొరత ఏర్పడింది. దీంతోప్రధానోపాధ్యాయుడితో పాటు ముగ్గురు టీచర్లను డిప్యూటేషన్‌పై పక్క పాఠశాలలకు పంపించారు. ఆశ్రమ పాఠశాలలో 6ఉపాధ్యాయులు ఉన్నా ఒకరిద్దరు మాత్రమే వచ్చి కాలక్షేపం చేసి పోతున్నారని గిరిజనులు ఆరోపిస్తున్నారు.

పేరుకే ఆశ్రమ పాఠశాల..

పేరుకే కామారం ఆశ్రమ పాఠశాలగా నడుపుతున్నారు. ఒకరిద్దరు చిన్నారులు వచ్చినా.. వారికి వండి పెట్టడంలేదని గిరిజనులు వాపోతున్నారు. చిన్నారులే ఇంటినుంచి అన్నం తెచ్చుకుని, తిని వెళ్తున్నారని విద్యార్థుల తల్లితండ్రులు ఆరోపిస్తున్నారు. ఉపాధ్యాయులతో పాటు వార్డెన్ సైతం ఇంటికి వెళ్లిపోవటంతో చిన్నారులను రాత్రి వసతి గృహంకు పంపటంలేదని చెప్తున్నారు.

మూడేళ్లుగా ఇదే తంతు..

ఆశ్రమ పాఠశాలలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించే ఏటీడ బ్ల్యూవో, డీడీ స్థాయి అధికారులు నిర్లక్ష్యం వల్ల మూడేళ్లుగా పాఠశాలకు చిన్నారులు రావటంలేదు. అయినా ఉన్న తాధికారులకు తప్పుడు నివేదికలు ఇస్తూ, పాఠశాల నడుస్తున్నట్లు నివేదికలు పంపటం విశేషం.

ఆ చిన్నారుల భవిష్యత్ ప్రశ్నార్థకం..

'ఆన్‌లైన్' ద్వారా నమోదు కాబడిన 23 మంది చిన్నారులు పాఠశాలకు రాక ఎక్కడ చదువుకుంటున్నారు అనేది ప్రశ్నార్థకంగా మారింది. మెరుగైన చదువు రావాలంటే ఇతర పాఠశాలల్లో కూడా ఆధార్‌కార్డు ద్వారా ఆన్‌లైన్ చేస్తేనే విద్యార్థికి అడ్మిషన్ దొరుకుతుంది. మరి ఇక్కడ ఆన్‌లైన్ ద్వారా చేరిన చిన్నారులు బడికిరాకపోతే వారి భవిష్యత్ ఏంటనేది జవాబులేని ప్రశ్నగా మారిం ది. గత మూడేళ్లుగా చిన్నరులురాని ఆశ్రమ పాఠ శాల నిధులు ఉన్నతాధికారులకు కామధేనులా మారాయి. ఏటా చిన్నారులకు మెనూ ప్రకారం భోజనానికి, పాలకు, స్నాక్స్ రూపంలో వచ్చే నిధు లను స్వాహా చేస్తున్నారని గిరిజనులు ఆరోపి స్తున్నారు. డ్రస్‌లు, బూట్లు, పుస్తకాలు, నోటు పుస్తకాలు, సబ్బులు, దుప్పట్లు ట్రంకు పెట్టెలు ఇతర సామగ్రి అంతా చిన్నారులకు పంపిణీ చేసి నట్లు రికార్డులు తయారు చేసి, స్వాహా చేస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఉపాధ్యాయులు వచ్చేలా చర్యలు తీసుకుంటాం

ఏటీడబ్ల్యూవో భాస్కర్

కామారం ఆశ్రమ పాఠశాలకు విద్యార్థులు రావటంలేదనేది వాస్తవమే. బడిబాట సమయంలో విద్యార్థులులేరని ఉపాధ్యాయులు నివేదికలు ఇచ్చారు. పాఠశాల మూతపడితే మళ్లీ మంజూరు చేయులేం. ఇటీవల నేను ఆశ్రమ పాఠశాలను విజిట్ చేసినప్పుడు 23 మందికి 5 చిన్నారులే వచ్చారు. దీంతో ఇక్కడ 10 మంది ఉపాధ్యాయు అవసరంలేదు. అందులో నలుగురిని డిప్యూటేషన్‌పై వేరే పాఠశాలకు పంపాం. మిగిలిన వారు పాఠశాలకు రాకపోతే విచారణ చేసి చర్యలు తీసుకుంటాం. పాఠశాలకు విద్యార్థులు, ఉపాధ్యాయులు వచ్చేలా చర్యలు తీసుకుంటాం

న్యూస్ బాక్స్

టీఎస్-యూటీఎఫ్ కేజీబీవీ రాష్ట్ర కోశాధికారిగా మంజుల



మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్-యూటీఎఫ్) కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయ (కేజీబీవీ) విభాగం రాష్ట్ర కోశాధికారిగా ఎం.మంజులను ఎన్నుకున్నట్లు టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మురళీకృష్ణ, యాకూబ్ శుక్రవారం తెలిపారు. హైదరాబాద్‌లోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఈనెల 21వ తేదీన జరిగిన కేజీబీవీ విభాగం సదస్సులో మహబూబాబాద్‌కు చెంది డోర్నకల్ కేజీబీవీలో పీజీ సీఆర్టీగా విధులు నిర్వహిస్తున్న మంజులను రాష్ట్ర కోశాధికారి గానియమించడం హర్షనీయమని తెలిపారు. తనను రాష్ట్ర కోశాధికారిగా నియమించేందుకు సహకరించిన రాష్ట్ర, జిల్లా టీఎస్-యూటీఎఫ్ నాయకులకు మంజుల కృతజ్ఞతలు తెలిపారు.

ఎంఆర్‌పీఎస్ జిల్లా కార్యదర్శిగా బిర్రు యుగేందర్



కేసముద్రం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎంఆర్‌పీఎస్ జిల్లా కార్యదర్శిగా కేసముద్రం స్టేషన్‌కు చెందిన బిర్రు యుగేందర్‌ను నియమించినట్లు ఎంఎస్‌పీ జాతీయనాయకుడు మంద కుమార్‌మాదిగ శుక్రవారం వెల్లడించారు. కేసముద్రంలో గురువారం నిర్వహించిన మండల సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా యుగేందర్ మాట్లాడుతూ తనకు ఈ బాధ్యతలు అప్పగించిన జాతీయ, రాష్ట్ర, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆస్పత్రిలో పీవైఎల్ సర్వే

ఇనుగుర్తి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆస్పత్రుల్లో సమస్యలపై ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) జిల్లా కార్యదర్శి కందాల రంగన్న ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక పీహెచ్‌సీలో సర్వే నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 15 నుంచి 30 వరకు సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పేద, బలహీనవర్గాల ప్రజలకు అవసరమయ్యే ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. జానకీ రాములు, ఆనంద్, అశోక్, సాంబయ్య, సాగర్, ప్రశాంత్ పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం

సీరోలు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది కాలంలో అమలు చేస్తున్న పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. సీరోలు మండల కేంద్రంతో పాటు కాంపల్లి, ఉప్పరగూడెం గ్రామాల్లో జిల్లా పౌరసంబంధాల అధికారి రాజేంద్రప్రసాద్ నేతృత్వంలో శుక్రవారం తెలంగాణ సాంస్కృతిక కళాకారులు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పాటల రూపంలో ప్రజలకు వివరిస్తూ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు మేరుగు రవీందర్‌గౌడ్, సత్యనారాయణ, యుగందర్, నరేష్, యకుశవాలి, రోజా, రాజలక్ష్మీ, కీర్తి, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిబా పూలే గురుకులంలో మొక్కలు నాటిన విద్యార్థులు

దంతాలపల్లి, నవంబరు22 (ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిబా పూలే పాఠశాలలో శుక్రవారం ఎన్‌సీసీ విద్యార్థులు మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడారు. ఎన్‌సీసీ క్యాడెట్లు సేవ్‌ట్రీస్, సేవ్ నేచర్, ఎన్విరాన్మెంట్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్, బసిత్, కొమ్ము ఉపేందర్, ఇతర పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి : సీపీఎం



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సూర్నపు సోమయ్య

మహబూబాబాద్ టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై తమ కలల ద్వారా చైతన్యం నింపి పోరాటాలకు సన్నద్ధం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు, ప్రజా నాట్యమండలి జిల్లా నిర్మాణ బాధ్యుడు సూర్నపు సోమయ్య అన్నారు. మహబూబాబాద్ పెరుమాండ్ల జగన్నాథం భవన్‌లో ప్రజానాట్యమండలి జిల్లాకమిటీ సమావేశాన్ని శుక్రవారం అల్వాల రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఆయన మాట్లాడుతూ పాలకవర్గాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైన కళాకారులకు, ప్రజలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంతో వైఫల్యం చెందిందన్నారు. పీఎన్ఎం జిల్లా కార్యదర్శి నక్క సైదులు, నూనె శ్రీనివాస్, మచ్చ వెంకన్న, బోర స్వామి, నాగరాజు, మన్నెం మల్లేష్, దగ్గుపాటి ఎల్లమ్మ, వద్దూరి నరేందర్, ఉప్పలయ్య, రాజు పాల్గొన్నారు.

'మొక్కలు నాటితే భవిష్యత్ తరాలకు మేలు'

మహబూబాబాద్ టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తే భవిష్యత్ తరాలకు ఆరోగ్యవంతంగా ఎంతో మేలు జరుగుతుందని ప్రజాహృదయం స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు, వన ప్రేమికుడు దైద వెంకన్న అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో కురవి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కె.ఉప్పలయ్య శుక్రవారం ప్రజాహృదయం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజు రోజుకు అడవులు అంతరించి పోవడం వల్ల పర్యావరణంలో సమతుల్యత లోపించి ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తున్నాయని చెప్పారు. వాటిని నుంచి తమను తాము రక్షించుకోవాలంటే మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం ఒక్కటే మార్గమని చెప్పారు. ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటాలని విజ్ఞప్తి చేశారు.

మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌ను

అరెస్ట్ చేయొద్దు

● పోలీసులు దర్యాప్తు చేయవచ్చు

● హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఓ భూకబ్జా కేసులో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌ను డిసెంబర్ 2 వరకు అరెస్ట్ చేయరాదని హైకోర్టు పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. ఆయనపై నమోదైన కేసు విషయంలో యథాతథంగా దర్యాప్తు కొనసాగించుకోవచ్చని పోలీసులకు స్వేచ్ఛ ఇచ్చింది. భూ కబ్జాతోపాటు అక్రమ ప్రవేశం,చోరీ తదితర ఆరోపణలతో పద్మావతి అనే ప్రభుత్వ టీచర్ ఫిర్యాదు మేరకు వరంగల్ సుబేదారి పోలీసులు పలు సెక్షన్ల కింద శంకర్‌నాయక్‌పై కేసు నమోదు చేశారు. పోలీసులు అక్రమంగా తనను ఇరికించాలని చూస్తున్నారని, కేసు కొట్టేయాలని కోరుతూ ఆయన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈనెల 25న మహబూబాబాద్‌లో బీఆర్ఎస్ తలపెట్టిన ధర్నాలో పాల్గొనకుండా వేధించే ఉద్దేశంతో పోలీసులు వ్యవహ రిస్తున్నారని ఆరోపించారు. వాదనలు విన్న ధర్మాసనం.. పిటిషనర్‌ను డిసెంబర్ 2 వరకు అరెస్ట్ చేయరాదని ఆదేశించింది. తదుపరి విచారణను అదే తేదీకి వాయిదా వేసింది.

'26న ధర్నాను విజయవంతం చేయాలి'

నెల్లికుదురు,నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రలో ఈనెల 26న నిర్వహించే వామపక్షాల ధర్నాను విజవంతం చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి మేక వీరన్న తెలిపారు. మండలకేంద్రంలోని విశ్రాంతి భవనంలో శుక్రవారం వామపక్షాల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు వ్యతిరేక చట్టాలను రద్దుచేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం రోజురోజుకు ధరలు పెంచుతూ కార్పోరేట్ వ్యవస్థలను అభివృద్ధి చేస్తూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశాడు. ధర్నాకు మేధావులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇనంపెల్లి సైదులు, బాబుగౌడ్, ఆలకుంట్ల సాయిలు, నవీన్, చిర్ర సత్యనారాయణ, భిక్షపతి, ఇరుగు అనిల్ పాల్గొన్నారు.

మిర్చిలో యాజమాన్య సాగు పద్ధతులు పాటించాలి

● జిల్లా వ్యవసాయాధికారిణి విజయనిర్మల



మొగిలిచర్లలో మర్చితోటను పరిశీలిస్తున్న విజయనిర్మల

కురవి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మిర్చిలో యాజమాన్య పద్ధతులు అనుసరించి సాగు చేయడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల అన్నారు. మొగిల్లిచర్లలో వ్యవసాయ క్షేత్రాలను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంట వివరాల నమోదును వ్యవసాయ విస్తీర్ణ అధికారులు కచ్చితంగా నిర్వహించాలన్నారు. వరి కొయ్యలు కాల్చివేయడం ద్వార భూమిపై పొరల్లో ఉండే ఎరువుల అవశేషాలు వాటిలో నీటిశాతాన్ని కోల్పోయి భూమి కట్టిగా నిస్సారంగా అవుతుందన్నారు. వరి కోసే సమయంలో నేలకు దగ్గరగా కోయాలని సూచించారు. ఏఈవో రాజేశ్వరి పాల్గొన్నారు.

జిల్లా కోర్టులో ఫస్ట్ ఎయిడ్ క్లినిక్ ప్రారంభం



జిల్లా జడ్జీలు సురేష్, తిరుపతికి మందులు అందజేస్తున్న ఫార్మసిస్టు

మహబూబాబాద్ రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కోర్టులో జిల్లా కోర్టులో ఫస్ట్ ఎయిడ్ క్లినిక్‌ను సీనియర్ సివిల్ జడ్జి సురేష్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి తిరుపతి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ వారి సహకారంతో మహబూబాబాద్ జిల్లా కోర్టులో ప్రథమ చికిత్స కేంద్రాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. కోర్టుకు వచ్చిన కక్షిదారుల్లో మహిళలు, వృద్ధులు, పిల్లలు అత్యవసర పరిస్థితుల్లో ఏదైనా వైద్యం సాయం కావాల్సి వస్తే వినియోగించుకునేందుకు అనుగుణంగా ప్రథమ చికిత్స కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోర్టు పరిపాలన అధికారి క్రాంతికుమార్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

తొర్రూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమాండ్ల తిరుపతి రెడ్డి అన్నారు. శుక్రవారం తొర్రూరు వ్యవసాయ మార్కెట్ ఆవరణలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని వైస్ చైర్మన్ భట్టునాయక్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం గ్రేడ్ ఏకు రూ.2320తో పాటు రూ.500 బోనస్ అందుతుందన్నారు. గ్రేడ్ బి వరి ధాన్యానికి రూ.2300 ప్రభుత్వం చెల్లిస్తుందని, రైతులు దళారులకు అమ్మకుండా కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి నిరంజన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సంతోష్, సోమ రాజశేఖర్, అచ్చిరెడ్డి, వెంకటాచారి, సంధ్యారాణి, రాంమ్మూర్తి, రమేష్, నరేందర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి తదితరులు ఉన్నారు.



వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ చైర్మన్ తిరుపతిరెడ్డి

వరి నారు మడులకు చలి నుంచి రక్షణ కల్పించాలి : ఏవో

గార్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రైతులు యాసంగిలో వరినారు మడులకు చలి ప్రభావం నుంచి రక్షణ కల్పించే విధంగా తగిన చర్యలు చేపట్టాలని వ్యవసాయశాఖాధికారి కావటి రామారావు సూచించారు. శుక్రవారం గార్ల పెద్ద చెరువు కింద యాసంగి వరి నారుమడుల్లో క్షేత్ర సందర్శన నిర్వహించి, రైతులకు పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చలి ప్రభావం వలన నరుమడులు ఎదక పోవడం దీనికి తోడు ఆకులు పసుపు రంగులోకి మారి కొన్నిచోట్ల చనిపోవడం జరుగుతుందన్నారు. దీన్ని గమనిస్తూ రైతులు సాయంత్రం వేళల్లో నారుమడుల్లోని నీటిని పూర్తి తీసివేస్తూ పగటి పూట వెచ్చనినీరు పెడుతూ ఉండాలన్నారు. అడుగు ఎత్తులో వెదురు కర్రలు అమర్చి, దానిమీద సన్నని ప్లాస్టిక్ పట్టాలతో నారుమడి మీదకప్పి మరుసటి రోజు తీసి వేయాలన్నారు. రైతులు యాసంగిలో వరి విత్తనాలు కేఎస్ఎం 1638, కేఎస్ఎం118, ఆర్ఎన్ఆర్, 15048, ఎంటీయూ1010 లాంటి వరి వంగడాలను విత్తుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో కిరణ్, రైతులు శీలంశెట్టి రమేష్, సర్వయ్య పాల్గొన్నారు.

'పూర్ణ సురక్ష' కేంద్రం ద్వారా వైద్యసేవలు

●డీఎంఅండ్‌హెచ్‌వో గుండాల మురళీధర్

నెహ్రూసెంటర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : అపరిచిత వ్యక్తులతో లైంగిక సంపర్కం ప్రమాదమని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి (డీఎంఅండ్‌హెచ్‌వో) గుండాల మురళీధర్ హెచ్చరించారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో లయన్స్‌క్లబ్‌లో శుక్రవారం అన్నిశాఖల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పూర్ణ సురక్ష కేంద్రం ద్వారా హెచ్‌ఐవీ, సుఖవ్యాధులకు సంబంధించిన సేవలు అన్ని ఒకేచోట ఉచితంగా లభిస్తాయని చెప్పారు. కన్సల్టెన్సీ చికిత్స సంబంధిత సేవలు, ఉచితంగా అందుతాయన్నారు. హెచ్‌ఐవీ, సుఖవ్యాధుల బారినపడే వారికి హెచ్‌ఐవీ నెగిటీవ్‌గా ఉన్నప్పటికి హెచ్‌ఐవీ, లైంగిక సుఖవ్యాధులకు దారితీసే ప్రమాదకర ప్రవర్తన పద్ధతులు పాటించే వారు ఈ వ్యాధుల బారిన పడకుండా నెగిటివ్‌గానే ఉండేందుకు అవసరమైన సేవలు అందించడమే సంపూర్ణ సురక్ష కేంద్రాల ప్రధాన లక్ష్యమన్నారు. సారంగం, సుధీర్, విజయ్, శ్రావణ్, నితీష్, సురేందర్, వసుమతి, జ్యోతి, రమేష్, రాజు, గీత, రామకృష్ణ, అనూరాధ, నీలిమ, శ్వేత, అశోక్, మంగమ్మ పాల్గొన్నారు.

'ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి'

తొర్రూరు, నవంబరు22 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసంలో శివ భక్తులకు, అయ్యప్ప స్వాములకు ఆర్టీసీ అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని తొర్రూరు ఆర్టీసీ డీఎం పద్మావతి అన్నారు. శుక్రవారం అయ్యప్ప స్వామి ఆలయంలో స్వాములను కలిసి ఆర్టీసీ సేవలు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అయ్యప్ప భక్తులకోసం డిపో నుంచి సూపర్ లగ్జరీ, డీలక్స్ బస్సులను కేరళలోని కొట్టాయం వరకు నడుపుతారని, ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలన్నారు. పంచారామాల దర్శనం కోసం ఈనెల 24న తొర్రూరు డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతారన్నారు. అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోటకు 24వ తేదీ డిపో నుంచి బస్సు బయలుదేరుతుందని, పెద్దలకు రూ.2000, పిల్లలకు రూ.1050తో రాను పోను చార్జీలతో ఈ పుణ్యక్షేత్రాలను దర్శించుకునే అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 99592 26053, 70321 82456 నంబర్లలో సంప్రదించాలన్నారు.

కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలి

మహబూబాబాద్ టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కేంద్రప్రభుత్వం అవలంబిస్తున్న రైతు, కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాసు మాధవి పిలుపునిచ్చారు. మహబూబాబాద్ పెరుమాండ్లజగన్నాథం భవన్‌లో శుక్రవారం సీఐటీయూ జిల్లా కమిటీ సమావేశాన్ని ఆకుల రాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన మాధవి మాట్లాడుతూ కేంద్రం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఈ నెల 26న జరిగే నిరసనలను విజయవంతం చేయాలని చెప్పారు. జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్, సమ్మెట రాజమౌళి, కుమ్మరికంట్ల నాగన్న, దుండి వీరన్న, మల్లయ్య, స్నేహబిందు, సంపూర్ణ, జయరాజు, వల్లాల వెంకన్న, మల్లేశం, శ్రీను, ఉప్పలయ్య, సుధాకర్, మోహన్ పాల్గొన్నారు.

నాస్ పరీక్షలను తేలికగా తీసుకోవద్దు

● విద్యాశాఖ ఏఎంవో ఆజాద్ చంద్రశేఖర్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా డిసెంబరు 4న నిర్వహించే నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (నాస్) పరీక్షలను అంత తేలికగా తీసుకోవద్దని విద్యాశాఖ అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఆజాద్ చంద్రశేఖర్ అన్నారు. మహబూబాబాద్‌లోని బాలికల ప్రాథమిక పాఠశాల, హనుమంతునిగూడెం ప్రాథమిక పాఠశాలలను శుక్రవారం సందర్శించి ఇటీవల నిర్వహించిన నాస్ పరీక్ష పేపర్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు ఝాన్సీరాణి, హల్యా, ఉపాధ్యాయులు బాలాజీకుమార్, వరలక్ష్మీ, శంకర్, నాగముని, సాయికుమార్, సృజన, లక్ష్మీ పాల్గొన్నారు.

జీపీ మల్టీపర్పస్ వర్కర్‌కు ఉత్తమ అవార్డు

దంతాలపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దాట్ల గ్రామ పంచాయతీలో పని చేస్తున్న మల్టీపర్పస్ వర్కర్ డొనికెని కంట్లం కు జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్ ఉత్తమ అవార్డును ప్రకటిస్తూ ఘనంగా సన్మానించారు. శుక్రవారం ఆయనను జిల్లా కేంద్రంలోని సమీకృత కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా కంట్లం మాట్లాడుతూ తాను గ్రామాల్లో చేస్తున్న విధులను పరిశీలించిన జిల్లా యాంత్రాంగం తనను ఉత్తమ అవార్డుకు ఎంపిక చేసినందుకు ప్రత్యేక అభినందనీయమన్నారు. పంచాయతీ కార్యదర్శి ఇతర మల్టీ పర్పస్ వర్కర్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

గేమ్స్‌లో మరిపెడ హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

మరిపెడ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాస్థాయి బీసీ హాస్టల్ గేమ్స్‌లో మరిపెడ హైస్కూల్ విద్యార్థులు అత్యంత ప్రతిభ చాటారు. ఈ గేమ్స్‌లో సత్తాచాటి స్కూల్‌కు గుర్తింపు తెచ్చిన విద్యార్థులను శుక్రవారం ఆ స్కూళ్లో హెచ్‌ఎం అనంతరావు, స్టాఫ్ అభినందించారు. ఈ నెల 20న మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో జరిగిన ఈ పోటీలలో కబడ్డీ బాలికల విభాగంలో లత, గంగోత్రి, సోనియ, ఆఫ్రిన్, వెన్నెల, పూజ, గౌతమి, ఖోఖోలో అంజలి, కౌసల్య, వాలీబాల్‌లో సాహితి, హేమశ్రీ, ఆఫ్రిన్, అంజలి, పూజ, కౌసల్య, 100మీటర్ల రన్నింగ్‌లో నందిని, పూజ జిల్లా స్థాయి ప్రథమ, ద్వితీయ స్థానాలు దక్కించుకొని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. బాలుర విభాగం ఖోఖోలో భరత్, అథ్లెటిక్స్‌లో ఆఫ్రిన్ రాష్ట్ర పోటీలకు అర్హత సాధించారు. పీఈటీ రాజకుమారి, స్టాఫ్ సెక్రటరీ రాంమోహన్, వార్డెన్లు ఉమారెడ్డి, ఈశ్వరమ్మ, కేర్ టేకర్ నాని తదితరులు ఉన్నారు.

గిరిజనులను రెచ్చగొడుతున్న కేటీఆర్

నెల్లికుదురు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కేటీఆర్ లగిచర్ల పేరుతో గిరిజనులను రెచ్చగొడుతున్నాడని మాజీ జడ్పీటీసీ హెచ్.వెంకటేశ్వర్లు తెలిపారు. మండల కేంద్రంలోని విశ్రాంతి భవనంలో శుక్రవారం కార్యకర్తసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో రత్నపురం యాకయ్య నాగయ్య, వెంకన్న, ఆకుల కొమురెల్లి, నర్సయ్య, వెన్నం మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

డోర్నకల్ స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం కల్పించాలి

● ఎంపీకి కాంగ్రెస్ నాయకుల వినతి



ఎంపీ బలరాంనాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న మునిసిపల్ చైర్మన్ వీరన్న, కాంగ్రెస్ నాయకులు

డోర్నకల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్ రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం కల్పించాలని మునిసిపల్ చైర్మన్ వాంకుడోతు వీరన్న, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు సుమీర్‌చంద్‌జైన్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు హైదరాబాద్‌లో మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. సికింద్రాబాద్-తిరుపతి మధ్య నడిచే పద్మావతి ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్-ముంబాయి-భువనేశ్వర్ కోణార్క్ ఎక్స్‌ప్రెస్, నర్సాపూర్-నాగర్సోల్-నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్‌తో పాటు కరీంనగర్-తిరుపతి మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ రైళ్లకు డోర్నకల్ రైల్వేస్టేషన్‌లో హాల్టింగ్ కల్పించాలని విజ్ఞప్తిచేశారు. అదే విధంగా మణుగూరు-భద్రాచలం రోడ్ మధ్య కోవిడ్‌కు పూర్వం నడిపిన ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించే విధంగా చొరవ చూపాలని ఎంపీని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ డీఆర్‌యూసీసీ మెంబర్ ఖైనుపాషా, కాంగ్రెస్ నాయకులు లాలునాయక్, బోడ హరిలాల్‌లు ఉన్నారు.